ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
చిత్తూరు
జిల్లా వార్తలు
గురువారం 9 అక్టోబరు 2025



అరాచకుల పీచమణచ..
బిగిసెను శాంతిదూత పిడికిలి
ఘోరాలను కళ్లజూసి..
ఎరుపెక్కెను చల్లనయ్య
మంచికాలం వచ్చునని..
మురిసెను మువ్వన్నెల జెండా
చిత్తూరు గాంధీసెంటర్‌లో
బుధవారం రాత్రి కనిపించిన
దృశ్యం.
- స్టాఫ్ ఫొటోగ్రాఫర్,
ఆంధ్రజ్యోతి, చిత్తూరు



చిత్తూరు-వేలూరు రహదారిలో ముట్టుకూరుపల్లె వద్ద అభివృద్ధి చేసిన నాలుగు లేన్ల రోడ్డు



గతంలో సింగిల్ రోడ్డుగా ఉన్న ముట్టుకూరుపల్లె రహదారి

అప్పుడలా.... ఇప్పుడిలా

గుడిపాల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పది సంవత్సరాల క్రితం చిత్తూరు-వేలూరు రహదారి సింగిల్ రోడ్డుగా వుండడంతో పాటు మలుపులుండడంతో తరచూ ప్రమాదాలు జరిగేవి. దీనికి తోడు ఈ మార్గంలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడేవారు. దీనిని దృష్టిలో ఉంచుకుని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నాలుగు లేన్ల విస్తరణ చేపట్టారు. దీంతో ప్రమాదాలు తగ్గడంతో పాటు వాహనాలు సులభంగా వెళ్లడానికి వీలైంది.

రోడ్ల అభివృద్ధికి మళ్లీ నిధులు

89.40 కిలోమీటర్ల మేర అభివృద్ధికి చర్యలు

- రూ.39.40 కోట్లతో 12 పనుల మంజూరు
- ఇప్పటికే రూ.260 కోట్లతో రహదారుల అభివృద్ధి

చిత్తూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 89.40 కిలోమీటర్ల రహదారుల్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం తాజాగా రూ.39.40 కోటను మంజూరు చేసింది.రాష్ట్రంలోని 274 రహదారుల అభివృద్ధికి రూ.వెయ్యి కోట్ల నిధులు మంజూరయ్యాయి.వీటిలో రాష్ట్ర రహదారుల కోసం రూ.400 కోట్లు, ప్రధాన జిల్లా రహదారుల కోసం రూ.600 కోట్లను కేటాయించారు.వైసీపీ ప్రభుత్వం రహదారుల్ని నిర్లక్ష్యం చేసింది. నిర్వహణను కూడా పట్టించుకోకపోవడంతో రహదారులన్నీ ఛిద్రమైపోయాయి.కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రహదారులకు ప్రాధాన్యమిస్తోంది. ఆగస్టులో రూ.38.25 కోట్ల నాబార్డు, స్టేట్ గవర్నమెంట్ నిధులతో జిల్లాలోని రహదారుల అభివృద్ధి పనులు చేపట్టగా.. అంతకుముందే రూ.222 కోట్లతో రహదారులకు మరమ్మతులతో పాటు అభివృద్ధి చేశారు. తాజాగా మంజూరైన రూ.39.40 కోట్లను కలుపుకుంటే ఇప్పటివరకు ప్రభుత్వం రహదారులకు కేటాయించిందే రూ.300 కోట్లు. మరోవైపు రూ.వేల కోట్లతో నేషనల్ హైవేస్, ఎక్స్‌ప్రెస్ హైవేస్ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి.

చిత్తూరు- గుడియాత్తం రోడ్డుకు రూ.7.50 కోట్లు

జిల్లాలోని రాష్ట్ర రహదారులైన చిత్తూరు- పుత్తూరు రోడ్డును రూ.3 కోట్లతో 5.6 కిలోమీటర్లు, చిత్తూరు- గుడియాత్తం రోడ్డును రూ.7.50 కోట్లతో 11.77 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేయనున్నారు.అలాగే ప్రధాన జిల్లా రహదారుల విభాగంలో పది రోడ్లను అభివృద్ధి చేయనున్నారు. ● కుప్పం,పలమనేరు,చిత్తూరు,పూతలపట్టు నియోజకవర్గాల్లోని అరిమానిపేట- వీకే రోడ్డు వయా వీర్నమల రహదారిని రూ.2.60 కోట్లతో 6.6 కిలోమీటర్లు ● కుప్పం గరిగచేనుపల్లె రోడ్డు - పీబీనత్తం వయా కాకిమడుగు... చెక్కునత్తం రోడ్డు - మల్లానూరు రైల్వేస్టేషన్ వయా వరదరాజపురం రోడ్లను రూ.2.60 కోట్లతో 7 కిలోమీటర్లు ● రాళ్లబూదుగూరు - కోనేరు కుప్పం రోడ్డు... శాంతిపురం సి.బండపల్లె - కరుముట్ల క్రాస్... రోడ్లను 5.77 కిలోమీటర్లు అభివృద్ధి చేసేందుకు రూ.2.20 కోట్లు ● కుప్పం- రామకుప్పం రోడ్డు వయా కృష్ణరాజపురం... 'గెర్నిపల్లె జంపురెడ్డి చెరువు, చాకలకుప్పం, గొరివిమాకులపల్లె రోడ్లను 9.70 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేసేందుకు రూ.4 కోట్లు ● దండికుప్పం రోడ్డు- విజలాపురం వయా వెంకటేశపురం... పలమనేరు కృష్ణగిరి రోడ్డు (కుప్పం పట్టణ పరిధి) 5.30 కిలోమీటర్ల అభివృద్ధికి రూ.2.20 కోట్లు ● పలమనేరు కుప్పం రోడ్డు- తమిళనాడు బోర్డర్ వయా కొలమాసనపల్లె రోడ్డును రూ.3.90 కోట్లతో 12.50 కిలోమీటర్లు ● ఏపీ రోడ్డు - అప్పినపల్లె వయా బొమ్మరాజుపల్లె రోడ్డు... పలమనేరు గుండుగల్లు రోడ్డు వయా దండుపల్లె శంకర్రాయలపేట రహదారుల్ని 12.50 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేసేందుకు రూ.4.70 కోట్లు ● సదుం- నంజంపేట రోడ్డు వయా చెరుకువారిపల్లె మార్గాన్ని 0.90 కిలోమీటర్ల మేర రూ.1.50 కోట్లతో ● సీకేటీ రోడ్డు- చిత్తూరు అరగొండ రోడ్డు వయా ముత్తిరేవుల నగనాగపల్లెరోడ్డును 6 కిలోమీటర్లు రూ.2.80 కోట్లతో ● చిత్తూరు వేలూరు రోడ్డు - చిత్తపార వరకు 5.83 కిలోమీటర్లు రూ.2.40 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు.

మూడో విడత రీ సర్వే ప్రారంభం

- 3859 ఎకరాల్లో కొలతలు తీసేందుకు ప్రత్యేక బృందాల ఏర్పాటు
- నాలుగు డివిజన్లలో 12 గ్రామాల ఎంపిక



చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మూడో విడత భూముల రీ సర్వే ప్రక్రియ బుధవారం నుంచి ప్రారంభమైంది.చిత్తూరు, నగరి, పలమనేరు, కుప్పం రెవెన్యూ డివిజన్లలోని 12 మండలాల్లో 12 గ్రామాలను సర్వే చేసేందుకు ఎంపిక చేశారు.మొత్తం 3859 ఎకరాల్లో సర్వే చేపట్టనున్నారు. 2026 మార్చి 31వ తేదీకి రీ సర్వే పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు.చిత్తూరు రెవెన్యూ డివిజన్లో ఎస్ఆర్‌పురం మండలంలోని రిపుంజరాజపురం, గుడిపాల మండలంలో రాగిమానుపట్టిడ, తవణంపల్లె మండలంలో గోవిందరెడ్డిపల్లె, జీడీ నెల్లూరు మండలంలో ఆత్మకూరు, పలమనేరు రెవెన్యూ డివిజన్లో వి.కోట మండలంలోని పైపల్లె, పెద్దపంజాణి మండలంలో ముట్టుకూరు, బంగారుపాళ్యం మండలంలో మొతగుంట, కుప్పం డివిజన్‌లో శాంతిపురం మండలంలోని చిల్లిమానుపల్లె, గుడుపల్లె మండలంలోని ఓఎన్ కొత్తూరు, నగరి డివిజన్‌లో కార్వేటినగరం మండలంలోని ఈదులవారిపల్లె, నింద్ర మండలంలో కూనమరాజుపాళెం, నగరి మండలంలో శ్రీనివాసపురం గ్రామాలను ఎంపిక చేశారు. తొలి విడతలో జిల్లా వ్యాప్తంగా 31 గ్రామాల్లో 30,774, రెండో విడతలో 38 గ్రామాలలో 40,359 ఎకరాల్లో భూమిని సర్వే చేశారు.రీ సర్వేకు గ్రామ, మండల సర్వేయర్లు, వీఆర్వోలు, వీఆర్ఏలను బృందాలుగా నియమించారు. క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని ఆర్ఐలు, డీటీలు, తహసీల్దార్లు, ఆర్డీవోలకు బాధ్యతలను అప్పగించారు. ఇప్పటికే భూముల కొలతలు, రెవెన్యూ రికార్డుల అధికారులు ప్రత్యేకంగా చొరవ తీసుకుని సిబ్బందికి శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించారు. ఎప్పుడెప్పుడు ఏయే పనులు ఎలా చేయాలనే విషయంపై ప్రణాళికలు పంపించారు. అందుకు అనుగుణంగా బాధ్యతలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న మ్యుటేషన్, భూ రికార్డుల్లో సవరణలు సకాలంలో పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ భూములను, అసైన్డ్ భూములను రీ సర్వేలో గుర్తించాలని, వాటలో సివిల్ కేసులుంటే కోర్టులను ఆశ్రయించేలా అర్జీదారులకు వివరించాలన్నారు.

గ్రామాలను చుట్టేసిన గజరాజులు

- రాత్రంతా పరుగులు పెట్టించిన వైనం



ఏనుగుల దాడిలో ధ్వంసమైన వరిపంట

కల్లూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం పాళెం, దేవళంపేట, అయ్యావాండ్లపల్లి, ఎర్రపాపిరెడ్డిగారిపల్లె, పులిచెర్ల, రెడ్డివారిపల్లె, గడ్డంవారిపల్లె పంచాయతీల్లో మంగళవారం రాత్రంతా ఏనుగుల గుంపు హల్‌చల్ చేశాయి. ఫారెస్ట్ సిబ్బందిని పరుగులు తీయించాయి. కొన్నిచోట్ల పంటలను ధ్వంసం చేశాయి. రోజూ చీకటిపడగానే చొరబడి పంటలను ధ్వంసం చేస్తుండటంతో కంటి మీద కునుకు లేకుండా పోతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మంగళవారం సాయంత్రం సూరప్ప చెరువు నుంచి బయలుదేరిన తొమ్మిది ఏనుగులు తొలుత పాళెం పంచాయతీ మీదుగా దేవళంపేట పంచాయతీ కుమ్మరిపల్లె వద్దకు చేరుకున్నాయి. నాగరాజు, రాజన్న, ధర్మేంద్ర, మధుసూదన నాయుడులకు చెందిన మామిడిచెట్లను ధ్వంసం చేశాయి. అటవీశాఖ సిబ్బంది గుర్తించి టపాకాయలు పేల్చడంతో ఇవి వీకే పల్లె, నల్లగుట్టపల్లె, అయ్యావాండ్లపల్లె మార్గంలో యర్రంవాండ్లపల్లె వద్దకు చేరుకున్నాయి. అక్కడ మామిడిచెట్లను ధ్వంసం చేసి పశుగ్రాసాన్ని తినేశాయి. అక్కడి నుంచి పిచ్చిగుండ్లపల్లె చేరుకని వరిపంటను ధ్వంసం చేశాయి. ఫారెస్ట్ సిబ్బంది మరోమారు టపాకాయలు పేల్చడంతో ఏనుగులు పులిచెర్ల- రామిరెడ్డిగారిపల్లె రోడ్డును దాటి మామిడిచెట్ల కొమ్మలను విరిచేశాయి. అక్కడి నుంచి ఏనుగుల గుంపు చిన్నగొట్టిగల్లు మండలంలోకి వెళ్లి మళ్లీ పులిచెర్ల మండలం గడ్డంవారిపల్లె పంచాయతీ పాపిరెడ్డిగారిపల్లె సమీపంలోని అడవికి చేరుకున్నాయి. బుధవారం పగలంతా మూలమడుగు వద్ద ఏనుగులు తిష్ట వేసినట్లు సమాచారం.

మేలుకో మహాశయా



అలా కుర్చీలో కునుకు తీశారా అధికారి. ఆయన్ను నిద్రలేపే సాహసం చేయలేకపోయారు సిబ్బంది. ఆయన తో పనుండి వచ్చిన వారూ ఎదురుగా కుర్చీల్లో కూర్చున్నారు. సార్.. ఎప్పుడు నిద్రలేస్తారోనని నిరీక్షిస్తున్నారు. ఇదీ నిత్యం రద్దీగా ఉండే రేణిగుంట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో బుధవారం నాటి చిత్రం. ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రారు ఆనంద్‌రెడ్డి ఇలా కునుకుతీస్తూ కనిపించారు. ఆయన సంతకం కోసం పలువురు వేచి ఉన్నారు. ఇక్కడ రద్దీలో ఏ పని జరగాలన్నా కొంత ఆలస్యం సహజం. కానీ ఇలా ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రారు వ్యవహారంతో సిబ్బందీ ఉదాసీనంగా ఉంటున్నారు.

- రేణిగుంట, ఆంధ్రజ్యోతి

స్త్రీనిధి ద్వారా రూ.346 కోట్ల రుణాలు

- డీఆర్డీఏ పీడీ శ్రీదేవి



చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది స్త్రీనిధి ద్వారా రూ.346 కోట్ల రుణాలు పంపిణీ చేయాలని నిర్ణయించినట్లు డీఆర్డీఏ పీడీ శ్రీదేవి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని డీఆర్డీఏ సమావేశ మందిరంలో ఏపీఎంలు, సీసీలతో జిల్లా ప్రగతిపై ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ 'ఉన్నతి' ద్వారా రూ.20 కోట్లు, సామాజిక పెట్టుబడి నిధి ద్వారా రూ.6 కోట్లు మంజూరు చేయాలని నిర్ణయించామని, ఈ అంశాలను ప్రజల్లో తీసుకెళ్లి వారి ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టిపెట్టాలని కోరారు. ఈ సందర్భంగా బ్యాంకు లింకేజి, మైక్రో క్రెడిట్ యాన్యువల్ యాక్షన్ ప్లాన్ (వార్షిక రుణప్రణాళిక), సప్లిమెంటరీ ఎన్‌సీపీ, స్త్రీనిధి, ఉన్నతి, ఉమెన్ లెడ్ ఎంటర్‌ప్రెన్యూర్స్ ఇన్‌స్టిట్యూషన్ బిల్డింగ్, లైవ్‌స్టాక్, ఆక్వాకల్చర్ అంశాలపై క్లస్టర్లు, మండలాలవారీగా సమీక్షించారు.

కాణిపాకం ఆలయ ట్రస్టు బోర్డు ఖరారు



ఊట్ల నాగరాజ నాయుడు - అనసూయమ్మ - పద్మలత

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి 16మందితో ట్రస్టు బోర్డు ఖరారైంది. చైర్మన్‌గా మణి నాయుడు అలియాస్ సురేంద్రను కొద్దిరోజుల క్రిత మే ఖరారు చేసిన విషయం తెలిసిందే. సభ్యులుగా మన రాష్ట్రం నుంచే కాక తెలంగాణకు చెందిన ఒకరిని కూడా నియమించారు.వీరిలో టీడీపీకి చెందిన వారితో పాటు జనసేన పార్టీ నుంచి ఇద్దరికి, బీజేపీ నుంచి ఒక్కరికి స్థానం లభించింది. వీరిలో చంద్రశేఖర రెడ్డి, కాది సుధాకర రెడ్డి,కొత్తపల్లె శివప్రసాద్, ఊట్ల నాగరాజు నాయుడు, పెరుమాళ్ల సుబ్బారెడ్డి(పూతలపట్టు నియోజకవర్గం),బీవీ సురేష్, వసంత(కుప్పం), కేఎస్.అనసూయమ్మ(గంగాధరనెల్లూరు), శ్రీవాణి (పీలేరు),పద్మలత కనకరాజు(చంద్రగిరి),పరిమి చంద్రకళ(తాడిపత్రి), సంధ్యారాణి దేవరకొండ (రాజంపేట),గుంటుపల్లె సునీత (ప్రత్తిపాడు),టీవీ రాజ్యలక్ష్మి(కర్నూలు), కీలపర్తి రాజేశ్వరి(మాడుగుల)తో పాటు తెలంగాణ నుంచి శ్రీపతి సతీష్ వున్నారు.

ఎస్వీయూ వీసీగా నరసింగరావు

నానో టెక్నాలజీ శాస్త్రవేత్తకు అవకాశం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూనివర్సిటీ నూతన ఉపకులపతిగా ప్రొఫెసర్ టాటా నరసింగరావు నియమితులయ్యారు. హైదరాబాదు ఐఐటీ రీసెర్చ్ అడ్వైజర్, అడ్జంక్ట్ ప్రొఫెసర్ అయిన నరసింగరావు గురువారం కొత్త పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు.మూడేళ్ల పాటు వీసీగా కొనసాగనున్న నరసింగరావు నానో టెక్నాలజీలో గొప్ప శాస్త్రవేత్తగా అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపుపొందారు.1994లో కాశీలోని బెనారస్ హిందూ యూనివర్సిటీలోని కెమిస్ట్రీ విభాగంలో పీహెచ్‌డీ పూర్తి చేసిన ఈయన మద్రాసు ఐఐటీలో రీసెర్చ్ అసోసియేట్‌గా పని చేశారు. టోక్యో యూనివర్సిటీలో 1996లో పోస్టు డాక్టోరల్ ఫెలోగా వ్యవహరించారు. 2001లో టోక్యో వర్సిటీలో అధ్యాపకులుగా చేరారు. హైదరాబాదులోని ఇంటర్నేషనల్ అడ్వాన్స్ రీసెర్చ్ సెంటర్‌లో సీనియర్ సైంటిస్టుగా 2003లో చేరి ఇదే కేంద్రానికి డైరెక్టర్‌గానూ సేవలందించారు. హైదరాబాదు ఐఐటీలో అడ్జంక్ట్ ప్రొఫెసర్‌గా పని చేశారు. ఎలక్ట్రో కెమిస్ట్రీ, నానో మెటీరియల్స్ రంగంలో నరసింగరావు పరిశోధనలు మంచి గుర్తింపు పొందాయి. వ్యక్తిగతంగానూ, బృందాలతోనూ పరిశోధనలు చేపట్టిన ఈయన విశేష ఆవిష్కరణలు చేశారు. కరోనా సమయంలో క్రిమి సంహారక మాస్కులను రూపొందించడంలో కృషి చేశారు. అధిక ఉష్ణోగ్రతలకు తట్టుకునే బ్యాటరీల తయారీకి ఈయన పరిశోధనలు తోడ్పడ్డాయి.2009లో మెటీరియల్ రీసెర్చ్ సొసైటీ ఆఫ్ ఇండియా అవార్డు, 2014లో టోక్యో యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ ప్రెసిడెంట్ అవార్డు, 2015లో అకాడమీషియన్ ఆఫ్ ఆసియా పసిఫిక్ అకాడమీ ఆఫ్ మెటీరియల్ సైన్స్ అవార్డు, 2016లో భారత రాష్ట్రపతి నుంచీ అవార్డు, 2017లో ఫెలో ఆఫ్ తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అవార్డు, 2022లో ఎంఆర్ఎస్ఐ మెటీరియల్ సైన్స్ వార్షిక బహుమతిని స్వీకరించారు.190 పరిశోధనా వ్యాసాలు రూపొందించారు.ఈయన పరిశోధనలకు 20 జాతీయ, అంతర్జాతీయ పేటెంట్లు లభించాయి.

బెట్టింగ్‌లో డబ్బులు కోల్పోయి విద్యార్థి ఆత్మహత్య


పుంగనూరు రూరల్, అక్టోబరు8(ఆంధ్రజ్యోతి): బెట్టింగ్‌లో డబ్బులు కోల్పోయి ఓ విద్యార్థి ప్రాణాలు తీసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.....పుంగనూరు పట్టణం ఎన్ఎస్‌పేటలోని మురిగిమఠంవీధికి చెందిన సుబ్రహ్మణ్యంరాజు కుమారుడు సురేంద్రరాజు(22) తమిళనాడులో బీటెక్ చదువుతున్నాడు.సెల్‌ఫోన్‌లో గేమ్స్ ఆడి దాదాపు రూ.30లక్షలు పోగొట్టుకున్నాడు. ఈ విషయం తెలిసిన తల్లిదండ్రులు మంగళవారం మందలించారు. దీంతో సురేంద్రరాజు ఇంటి నుంచి వెళ్లిపోయి వనమలదిన్నె మార్గంలోని పొలంలో పశువుల షెడ్ వద్ద పురుగులమందు తాగాడు. స్పృహకోల్పోయిన ఇతడ్ని పరిసరాల్లోని రైతులు గుర్తించారు. కుటుంబసభ్యులకు తెలియజేశారు. వారు చేరుకుని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో చెన్నై సీఎంసీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.



నారా రోహిత్



అమరెడ్డి, పవిత్ర



కోనా వెంకట్

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరిలో సినీహీరో నారా రోహిత్, నటులు అమరెడ్డి, పవిత్ర, మాటల రచయిత కోనా వెంకట్, సీనియర్ ఐఏఎస్ అధికారి పంకజ్ కుమార్ బన్సల్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఉన్నారు.


- తిరుమల, ఆంధ్రజ్యోతి

సత్యాత్మతీర్థ స్వామిజీకి తిరుమలలో పెద్దమర్యాద



తిరుమల, అక్టోబరు8 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాదిమఠాధిపతి సత్యాత్మతీర్థ స్వామిజీ బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం నైవేద్య విరామ సమయంలో అఖిలాండం వద్ద స్వామిజీకి టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అర్చక బృందం ఇస్తికాఫల్(పెద్ద మర్యాద) స్వాగతం పలికారు. ఆలయం నుంచి పల్లకీలో తీసుకెళ్లిన శఠగోపంతో ఆశీర్వాదం అందించారు. అనంతరం ఆయన తన శిష్యబృందంతో కలిసి మంగళవాయిద్యాల నడుమ ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు.

సర్వదర్శనానికి 14 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.4.74 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 71,634

తలనీలాలు సమర్పించినవారు: 24,980

వెంకటేశ్వరస్వామి ఆలయంపై పిడుగుపాటు



దెబ్బతిన్న ఆలయ గోపుర శిఖర భాగం - పగిలి కిందపడిన దేవతామూర్తుల భాగాలు

సూళ్లూరుపేట,అక్టోబరు8(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండలంలోని మంగళంపాడు వెంకటేశ్వరస్వామి ఆలయ గోపురంపై బుధవారం సాయంత్రం పిడుగు పడింది. 4 గంటల సమయంలో భారీ వర్షంతో పాటు పెద్ద శబ్దంతో పిడుగు పడడంతో ఆలయ గోపురంపై ఉన్న శిలలు దెబ్బతిన్నాయి. అలాగే గోపురంపై ఉన్న దేవతామూర్తుల భాగాలు పగిలి కింద పడ్డాయి. అదే సమయంలో ఆలయ వరండాలో ఉన్న కొందరు గ్రామస్తులు భయంతో పరుగులు తీశారు. కాసేపటికి తేరుకున్న గ్రామస్తులు పిడుగు పడిన ప్రదేశాన్ని పరిశీలించారు.

'తుడా టవర్స్'సేల్‌పై కమిటీ

- రెసిడెన్షియల్ ఫ్లాట్ల ధరలు సవరణకు కసరత్తు
- ఒక్కోఫ్లాట్‌పై రూ.5లక్షల నుంచి రూ.10 లక్షల వరకు తగ్గే అవకాశం
- మంత్రి గ్రీన్ సిగ్నల్

తిరుపతి, ఆంధ్రజ్యోతి

తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) అన్నమయ్య సర్కిల్లో నిర్మిస్తున్న ఐకానిక్ టవర్స్‌లో రెసిడెన్షియల్ ఫ్లాట్ల ధరలు తగ్గనున్నాయి. అధిక ధరల వలన విక్రయాలు మందకొడిగా సాగుతుండడంతో కమిటీని ఏర్పాటుచేసేందుకు తుడా సిద్ధమైంది. 206 రెసిడెన్షియల్ ఫ్లాట్లలో ఇప్పటికి 21మాత్రమే అమ్ముడయ్యాయి. చదరపు అడుగు ధర ఎక్కువగా ఉండడం వల్లే కొనుగోలుదారులు ముందుకురావడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇటీవల పురపాలక శాఖ మంత్రి నారాయణ తుడా కార్యాలయంలో జరిగిన సమీక్షలో ఐకానిక్ టవర్స్ గురించి ఆరాతీశారు. స్థానికంగా ఉన్న అపార్ట్‌మెంట్ల ధరలను పరిశీలిస్తే, తుడా టవర్స్‌లోని రెసిడెన్షియల్ ఫ్లాట్ల చదరపు అడుగు ధర ఎక్కువగా ఉందన్న అభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది. దీనికోసం ఓ కమిటీని ఏర్పాటుచేసి ధరలను సవరించాలని తుడా వీసీ శుభం బన్సల్ మంత్రిని కోరారు. మంత్రి కూడా గ్రీన్ సిగ్నల్ ఇస్తూ త్వరలోనే ఆ ప్రక్రియ పూర్తిచేయాలని సూచించారు. ప్రస్తుతం రెసిడెన్షియల్ ధర చదరపు అడుగు రూ.5,900 గా ఉంది. దీనిని రూ.5,500లుగా సవరించే అవకాశం కనిపిస్తోంది. అంటే ఒక్కో ఫ్లాట్ ధర రూ.5లక్షల నుంచి రూ.10లక్షలు తగ్గించే అవకాశం కనిపిస్తోంది. అదేవిధంగా కమర్షియల్ స్పేస్ చదరపు అడుగు రూ.12వేలు ఉంది. 31 వాణిజ్య సముదాయాల్లో 11 సేల్ అయిపోయాయి. దీనికి మంచి డిమాండు ఉండడంతో వీటి ధరలో ఎలాంటి మార్పు ఉండకపోవచ్చు.



టవర్స్ తాజా పరిస్థితి

తుడా టవర్స్ 3.6 ఎకరాల్లో రూ.345 కోట్లతో నిర్మాణం జరుగుతోంది. ప్రస్తుతం రూ.122 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయి. 14 అంతస్తుల భవనంలో 12వ ఫ్లోర్ స్లాబ్ పూర్తయింది. 6వ ఫ్లోర్ వరకు టైల్స్ పనులు జరిగాయి. ఈ ప్రాజెక్టు ద్వారా నిర్మాణ వ్యయం కాకుండా తుడా రూ.150కోట్లు ఆదాయం లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే రూ.91కోట్లు విక్రయాల ద్వారా తుడా ఖాతాలోకి చేరాయి. మరో రూ.66 కోట్లు రావాల్సి ఉంది.

జూన్‌లో నిర్మాణం పూర్తి

గ్రౌండ్, ఒకటవ అంతస్థులో 27 విశాలమైన గదులతో వాణిజ్య సముదాయాలు, రెండు, మూడు, నాలుగు అంతస్థుల్లో ఆఫీసుల వినియోగానికి, మిగిలిన వాటిలో 206 రెసిడెన్షియల్ ఫ్లాట్లను నిర్మిస్తున్నారు. కమర్షియల్, రెసిడెన్షియల్‌కు వేర్వేరుగా యాంపుల్ పార్కింగ్, లిఫ్టులు, వేర్వేరుగా మార్గాలు ఏర్పాటు చేస్తున్నారు. జూన్‌లోపు అందుబాటులోకి వస్తుందని తుడా కార్యదర్శి డాక్టర్ శ్రీకాంత్ చెప్పారు.

డ్రైవర్ ఆత్మహత్య

- ఎస్ఐ బెదిరింపులే కారణమని తల్లి ఆరోపణ



అనిల్ (ఫైల్‌ఫొటో)

కోట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కోట మండలం చిట్టేడు గ్రామానికి చెందిన నన్నిమేల అనిల్ (36) గడ్డి మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఓ రొయ్యల పరిశ్రమకు చెందిన కార్మికులను తీసుకెళ్లే బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్న అనిల్ పెద్దమొత్తంలో అప్పులు చేశాడు. రుణదాతల ఒత్తిళ్లు భరించలేక బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగాడు. కుటుంబసభ్యులు గమనించి కోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో గూడూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఇదిలా ఉండగా ఒక బాకీదారుడికి అప్పు చెల్లించాలని ఎస్ఐ పవన్‌కుమార్ బెదిరించడంతోనే తమ బిడ్డ ఆత్మహత్య చేసుకున్నాడని అనిల్ తల్లి ఉమామహేశ్వరి గూడూరు డీఎస్పీ గీతాకుమారికి ఫిర్యాదు చేశారు. ఎస్ఐపై వచ్చిన ఆరోపణలపై దర్యాప్తు చేస్తున్నామని వాకాడు సీఐ హుస్సేన్ బాషా తెలిపారు.

'మార్పు'తోనే మనుగడ

- సహకార రంగం బలోపేతమే లక్ష్యం
- తిరుపతి సదస్సులో కేంద్ర సహకార మంత్రిత్వశాఖ కార్యదర్శి ఆశిష్‌కుమార్ భూటాని



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఆశిష్‌కుమార్ భూటాని

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): 'ఏ రంగమైనా మార్పుతోనే మనుగడ సాధిస్తుంది. గ్లోబలైజేషన్, సాంకేతిక పరిణామాలకు అనుగుణంగా మలచుకోలేక అనేక సహకార సంస్థలు ప్రాధాన్యం కోల్పోయాయి. పాత విధానాలు కొనసాగిస్తూ, సభ్యులను ఆకర్షించలేకపోయాయి. దీనికి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలే నిదర్శనం. ఏపీలో మాత్రం పీఏసీఎస్‌లు ఇపుడు పెట్రోల్ బంకు వంటి కొత్త రంగాల్లో అడుగుపెట్టడం సంతోషకరం' అని కేంద్ర సహకార మంత్రిత్వశాఖ కార్యదర్శి ఆశిష్‌కుమార్ భూటాని అన్నారు. 'సహకార రంగం అభివృద్ధి- డిజిటలైజేషన్, గ్రైన్ స్టోరేజ్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు విస్తరణ, కోఆపరేటివ్ బ్యాంకింగ్ బలపరిచే దిశగా' అంశంపై రెండు రోజుల పాటు జరిగే జాతీయ సదస్సు బుధవారం తిరుపతి తాజ్‌హోటల్‌లో ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రాల్లో సహకార రంగాన్ని బలోపేతం చేయడం, ఆర్థిక వృద్ధిని పెంపొందించడంపై ప్రత్యేక దృష్టిపెడుతున్నట్లు చెప్పారు. సహకార బ్యాంకింగ్ రంగంలో రాష్ట్రాల నుంచి మరింత లోతైన ఆలోచన రావాల్సిన అవసరం ఉందన్నారు. కొత్త రంగాల్లో తాము చేస్తున్న ప్రయత్నాలపైనా చర్చ జరుగుతోందన్నారు. సహకార ట్యాక్సీలు, బీమా రంగంలో రాష్ట్రాల భాగస్వామ్యంపైనా చర్చిస్తామన్నారు. రాష్ట్రాలలో సహకార విద్యావ్యవస్థను ఎలా అనుసంధానించాలో, పాఠశాలలు ఎలా స్థాపించాలనే దానిపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు వివరించారు. ఈ సదస్సులో మూడు నెలల కార్యాచరణపై ముఖ్యమైన అంశాలు ఉంటాయన్నారు.



ఇతర రంగాల్లోకి విస్తరిస్తాం

సహకార సంస్థలు కేవలం రైతుల రుణావసరాలను తీర్చడమే కాకుండా ఆరోగ్యసేవలు(జన ఔషధి కేంద్రాలు), ఆహార ప్రాసెసింగ్, డ్రోన్ ఆధారిత ఎరువుల పంపిణీతో పాటు ఇతర రంగాల్లోకి విస్తరిస్తాయని రాష్ట్ర సహకార కమిషనర్ ఎం.బాబు తెలిపారు. ఇలాంటి సదస్సులు సహకార రంగాన్ని మరింత బలోపేతం చేస్తాయన్నారు. సహకార సంఘం బలోపేతం, ఆర్థికవృద్ధిపై కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శులు పంకజ్‌కుమార్‌బన్సాల్, రవీంద్రకుమార్ అగర్వాల్, సంయుక్త కార్యదర్శులు ఆనందకుమార ఝా, రమణకుమార్ ప్రసంగించారు. వివిధ సహకారశాఖలు స్టాళ్లను ప్రదర్శించాయి. ఈ ఎగ్జిబిషన్‌లో సామాన్యులకు అందజేస్తున్న హార్డ్‌వేర్ కిట్, ఈఆర్పీ సాఫ్ట్‌వేర్ ప్రత్యక్ష డెమోను నిర్వహిస్తున్నారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఆయా కార్యక్రమాల్లో కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్, అడిషనల్ రిజిస్ట్రార్లు ఆనందబాబు, గౌరీశంకర్, జాయింట్ రిజిస్ట్రార్లు శ్రీలక్ష్మి, చిత్తూరు, తిరుపతి డీసీవోలు లక్ష్మి, నాగవర్ధన, వివిధ రాష్ట్రాల సహకార సంఘాల కార్యదర్శులు, రిజిస్ట్రార్లు, నాబార్డు, ఎంపీడీసీ, సహకార సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

దేశ భవితను తీర్చిదిద్దడంలో ప్రభుత్వ వ్యవస్థ కీలకం

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ వెల్లడి



ఐఐటీ విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందితో జయప్రకాష్ నారాయణ

ఏర్పేడు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ప్రభుత్వ వ్యవస్థ ఎంతో అవసరమని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు, ప్రజా విధాన నిపుణుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ సూచించారు. ఏర్పేడు వద్దనున్న తిరుపతి ఐఐటీలో 'ఇండియా: ది రోడ్ అహెడ్' అంశంపై బుధవారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో సమర్థ పాలన ప్రాధాన్యాన్ని వివరించారు. శాంతి, చట్టపరమైన వ్యవస్థ, విద్య, ఆరోగ్య సంరక్షణ వంటి మౌలిక వసతులు, సామూహిక అవసరాల గురించి విశదీకరించారు. భారత ప్రజాస్వామ్య ఆర్థిక అభివృద్ధిపై సంస్కరణలు చూపిన ప్రభావాన్ని వివరించారు. సమగ్ర సుస్థిర వృద్ధి ద్వారానే సమాజంలోని అసమానతలు తొలగించవచ్చని చెప్పారు. తిరుపతి ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ మాట్లాడుతూ తిరుపతి ఐఐటీ సాధించిన ప్రగతి, చేపట్టిన చర్యలు, ఇప్పటి వరకు ఐఐటీ అందుకున్న అవార్డుల గురించి తెలిపారు. లెక్చర్ సిరీస్ అనంతరం విద్యార్థులు, అధ్యాపకులు, ఐఐటీ సిబ్బంది డాక్టర్ జయప్రకాష్ నారాయణతో 'పాలన ప్రజా విధానాల సవాళ్లు, యువత పాత్ర' వంటి అంశాలపై ముఖాముఖిగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బ్లైండ్ స్కేటర్‌కు ఆర్థికసాయం



హర్షవర్ధన్‌కు ఆర్థికసాయం అందిస్తున్న దాతలు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

తిరుపతి (క్రీడలు), అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన బ్లైండ్ స్కేటర్ హర్షవర్ధన్‌కు రూ.25 వేల సాయం అందింది. కళ్లు కనిపించకున్నా ఆ చిన్నారి స్కేటింగ్‌లో రాణిస్తున్న విషయమై సోమవారం ఆంధ్రజ్యోతిలో 'చూపులేకున్నా తగ్గేదే లే' శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన సూళ్లూరుపేటకు చెందిన ఆచార్య భరద్వాజ సేవా సంస్థ ప్రతినిధులు బుధవారం హర్షవర్ధన్ ఇంటికెళ్లి తల్లి రాజకుమారి, అన్న మునిచరణ్, కోచ్ ప్రతాప్ సమక్షంలో రూ.25వేల నగదు అందించారు. కోచ్ ప్రతాప్‌ను సన్మానించారు. ప్రపంచ రికార్డును కైవసం చేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సేవాసంస్థ ప్రతినిధులు ఎం.చంద్రబాబు, ఎ.అశోక్‌కుమార్, వి.రత్నబాబు, ఎ.భాస్కరరావు, ఎం.శ్రీనివాసులు, వి.సాయినాథ్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె తప్పదు

- 13న ఛలో విజయవాడ
- డిస్కం కార్పొరేట్ కార్యాలయం వద్ద ధర్నా



తిరుపతి(ఆటోనగర్), అక్టోబరు8 (ఆంధ్రజ్యోతి): 'సదరన్ డిస్కంలో పెండింగ్ సమస్యలు, కాంట్రాక్టు కార్మికులు,గ్రేడ్-2 జేఎల్‌ఎంలను రెగ్యులర్ చేయాలని జేఏసీ అధ్వర్యంలో దశలవారీ ఆందోళనలు చేస్తున్నాం. అయినా యాజమాన్యం, ప్రభుత్వం స్పందించలేదు. కమిటీలతో కాలయాపన తప్ప ఫలితం ఉండదు. 13న ఛలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తాం. అప్పటికీ సమస్యలు పరిష్కారం కాకుంటే 15వ తేది నుంచి నిరవధిక సమ్మె తప్పదు' అని పవర్ జేఏసీ నాయకులు హెచ్చరించారు. తిరుపతి సదరన్ డిస్కం కార్యాలయం ఎదుట బుధవారం జేఏసీ అధ్వర్యంలో మహా ధర్నా జరిగింది. జేఏసీ నాయకులు వి.దేవేంద్ర రెడ్డి, ఆర్.మురళీధర్, నాగరాజు, ఎల్.చలపతి, నాగార్జున, కృష్ణయ్య, బాలశౌరి, జయరామ్ మాట్లాడుతూ 26 ఏళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వడం లేదన్నారు. ఉద్యోగులకు 4 డీఏలు చెల్లించలేదన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈపీఎఫ్‌ను రద్దు చేసి జీపీఎఫ్‌ను అమలు చేయాలన్నారు. గ్రేడ్-2 జేఎల్‌ఎంలను రెగ్యులర్ చేసి, వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. యాజమాన్యం జేఏసీ నేతలతో చర్చించకుండా, బలంలేని టీఎస్‌టీయూసీ నాయకులను ఆహ్వానించడం ఏమిటని ప్రశ్నించారు. కాంట్రాక్టు కార్మికులతో రెగ్యులర్ విధులు చేయిస్తూ స్టైఫండ్ ఎన్నేళ్లు ఇస్తారని ప్రశ్నించారు. ఈ ధర్నాలో నాయకులు రామలింగారెడ్డి, సంజీవరావు, తిరుపాలు, జయమణి, సతీష్, పృథ్వీరాజ్, ఆంజనేయులు, వి.గోపి, జి.ఏలుమలై, సుధాకర్, శంకర్, రాజేంద్రప్రసాద్ ప్రసంగించారు. ఈ ఆందోళనలో ఉమ్మడి ఏడు జిల్లాల నుంచి విద్యుత్ ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.



ధర్నాలో పాల్గొన్న కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ సంఘం నాయకులు

పశువైద్య రంగంలో 'బేసిక్ సైన్స్' పరిశోధనలు అవసరం

వెటర్నరీ వర్సిటీ జాతీయ సదస్సులో డాక్టర్ తిలగర్

తిరుపతిరూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పశువైద్య రంగంలో బేసిక్ సైన్స్‌తో సంబంధమైన పరిశోధనల రూపకల్పన ఎంతో అవసరమని తమిళనాడు పశువైద్య వర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.తిలగర్ పేర్కొన్నారు. ఎస్వీవెటర్నరీ కళాశాలలో పశువైద్య చికిత్స బోధన సముదాయ(వీసీసీ)విభాగ ఆధ్వర్యంలో 'నేషనల్ క్లినికల్ కేస్ కాన్ఫరెన్స్ ఫర్ వెటర్నరీ స్టూడెంట్స్' అంశంపై బుధవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. నైపుణ్యాలతోపాటు పశుచికిత్స, శస్త్రచికిత్సలకు సంబంధించిన ఆధునిక పశువిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. పశువ్యాధులు, వైద్యంలో స్పెషలైజేషన్లు చాలా అవసరమని, ఈదిశగా పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులు ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. శస్త్రచికిత్స, డయాగ్నోసిస్, వ్యాధినిర్ధారణ విభాగాల ప్రాముఖ్యతని ఇండియన్ సొసైటీ ఫర్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ కెనైన్ ప్రాక్టీస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ప్రతాబన్ విశదీకరించారు. పశువైద్య రంగంలో కృత్రిమమేథ ఎంతో కీలకంగా మారిందని వర్సిటీ వీసీ ప్రొఫెసర్ జేవీ రమణ పేర్కొన్నారు. వీసీసీ ఆధ్వర్యంలో ఆధునిక పద్ధతుల్లో పశువైద్యసేవలు అందిస్తున్నామన్నారు. ఆప్తమాలజీ సేవలను పశువైద్యచికిత్స బోధనావిభాగంలో ఆధునిక పద్ధతుల్లో సమకూర్చాలని డీన్ ప్రొఫెసర్ కె.వీరబ్రహ్మయ్య వీసీని కోరారు. ఆయా అంశాలపై విద్యార్థులు అధ్యయనం చేయాలని అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ జగపతిరామయ్య సూచించారు. పశువ్యాధులను ప్రారంభదశలో నిర్ధారించడం ద్వారా మెరుగైన వైద్యసేవలు అందించవచ్చని సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రొఫెసర్ డాక్టర్ వి.వైకుంఠరావు అన్నారు. ఈ సదస్సుకు 14 రాష్ట్రాల నుంచి 25 వెటర్నరీ కళాశాలలకు చెందిన 250మంది విద్యార్థులు హాజరయ్యారు. పలువురు విద్యార్థులు పేపర్ ప్రజంటేషన్ చేశారు. ప్రొఫెసర్లు ఎం.రఘునాథ్, ఎస్.ధనలక్ష్మి, ఎస్.భారతి, డాక్టర్ నస్రీన్ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ సదస్సు బుక్‌లెట్‌ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ తిలగర్, డాక్టర్ జేవీరమణ, ప్రతాబన్ తదితరులు

ముక్కంటి హుండీ ఆదాయం రూ.2.18 కోట్లు



శ్రీకాళహస్తి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీ ఆదాయం రూ.2,18,65,233 సమకూరినట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. బుధవారం ఆలయం ఆవరణలోని కొట్టు మండపంలో హుండీ లెక్కింపు చేపట్టారు. ప్రధాన హుండీలతోపాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీల నుంచి 134 గ్రాముల బంగారం, 698.500 కిలోల వెండి, 151 విదేశీ కరెన్సీ 151 వచ్చింది. ఆగస్టు 30వ తేదీ నుంచి వచ్చిన కానుకలు లెక్కించగా ఈ ఆదాయం సమకూరింది. కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

- మృతులది పళ్లిపట్టు సమీపం

పుత్తూరు అర్బన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పుత్తూరు జాతీయ రహదారిలో బుధవారం మధ్యాహ్నం 3.20 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందారు. తిరుమల శ్రీవారిని దర్శించుకుని ద్విచక్ర వాహనంలో ఇంటికి వెళుతుండగా.. వెనకనుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొన్నట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఈ ఘటనలో అక్కడికక్కడే వీరిద్దరూ మృతిచెందారు. మృతులు.. తిరవళ్లూరు జిల్లా పళ్లిపట్టు తాలూకా పొతట్టూరుపట్టై గ్రామానికి చెందిన బి.వి.సుబ్రమణ్యం(53), మూర్తి గురునాథం (60)గా పోలీసులు గుర్తించారు. ప్రమాదానికి కారణమైన వాహనం కోసం పోలీసులు గాలిస్తున్నారు. మృతుల కుటుంబాలకు సమాచారం ఇచ్చిన ఎస్ఐ ఓబయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.





రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బి.వి.సుబ్రమణ్యం, మూర్తి గురునాథం

అంబేడ్కర్ ఘటనపై నేడు చిత్తూరులో నిరసన ర్యాలీ

వెదురుకుప్పం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం దేవళం పేటలో అంబేడ్కర్ విగ్రహ దహనం ఘటనకు సంబంధించి గురువారం చిత్తూరులో జిల్లా తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ జరుగుతుందని ప్రభుత్వ విప్, గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే థామస్ బుధవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరులో గురువారం ఉదయం 10 గంటలకు గాంధీ విగ్రహం కూడలి నుంచి దర్గా సర్కిల్ అంబేడ్కర్ విగ్రహం వరకు జిల్లా టీడీపీ ఆధ్వర్యంలో జరిగే నిరసన కార్యక్రమంలో తాను పాల్గొంటానని, నియోజకవర్గంలోని కూటమి నాయకులందరూ తరలి రావాలని ఆయన కోరారు. అనంతరం గంగాధరనెల్లూరు ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ఉదయం 11 గంటలకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జరిగే పోషణ్ కార్యక్రమంలో, మధ్యాహ్నం 12.30 గంటలకు గంగాధరనెల్లూరులో జరిగే సూపర్ జీఎస్టీ 2.0 కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారు.

పేలుడు పదార్థాల రవాణా కేసులో ఐదేళ్ల జైలు, జరిమానా

చిత్తూరు లీగల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా పేలుడు పదార్థాలు రవాణా చేసిన వ్యక్తికి ఐదేళ్ల జైలు, జరిమానా విధిస్తూ జిల్లా కోర్టు తీర్పునిచ్చింది. 2019 ఫిబ్రవరి 22వ తేదిన సాయంత్రం కుప్పం పోలీసులు కృష్ణాపురం గ్రామం వద్ద భారత్ పెట్రోల్ బంకు దగ్గర వాహనాలు తనిఖీ చేస్తుండగా టిఎన్49 బి8370 నెంబరు గల ట్రాక్టర్ తమిళనాడు వైపు నుంచి కుప్పం వైపు వచ్చింది. తమిళనాడు రాష్ట్రం సత్రపల్లి గ్రామానికి చెందిన మురుగన్ అనే వ్యక్తి ట్రాక్టర్‌ను ఆపి పరారయ్యేందుకు ప్రయత్నించాడు. పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా, అతడి నుంచి 40 డిటోనేటర్లు, 40 జెనెటిన్ స్టిక్స్, ఒక మగ్గర్ బాక్స్‌తో పాటు ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు అతడిపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు బుధవారం జిల్లా కోర్టులో వాయిదా వుండగా, పూర్వాపరాలు పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక అతడిపై నేరం రుజువు కావడంతో ఐదు సంవత్సరాలు జైలు, రూ.5 వేలు జరిమానా విధిస్తూ తీర్పుచెప్పారు. ఈ కేసును పీపీ బి.రామకృష్ణమ నాయుడు వాదించారు.

15న తోతాపురి మామిడి రైతుల ఆక్రందన సభ

బంగారుపాళ్యం, అక్టోబర్ 8(ఆంధ్రజ్యోతి): ఈ నెల 15వ తేదీన మండల కేంద్రమైన బంగారుపాళ్యంలో జరిగే మామిడి రైతుల ఆక్రందన సభను జయప్రదం చేయాలని మామిడి రైతుల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు జనార్దన్, మునీశ్వర రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం వారు మీడియాతో మాట్లాడుతూ తోతాపురి మామిడికి ప్రభుత్వం ప్రకటించిన రూ.12 మద్దతు ధరను రైతులకు ఇవ్వడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని వాపోయారు. మామిడి రైతుల ఆక్రందన సభకు జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున మామిడి రైతులు వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ప్రకటించిన కేజీ రూ.8, సబ్సిడీ రూ.4 తోతాపురి మామిడి రైతులకు వెంటనే చెల్లించాలనే డిమాండ్‌తో సమావేశం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సురేంద్రన్, సంజీవిరెడ్డి, మురళీ, త్యాగరాజు రెడ్డి, సందీప్, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎర్రచందనం దుంగల స్వాధీనం



భైరెడ్డిపల్లె, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): నెల్లిపట్ల అటవీప్రాంతంలో బుధవారం అటవీశాఖాధికారులు రెండు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. ఎర్రచందనం దుంగలకు సంబంధించి పూర్తి వివరాలను అటవీశాఖాధికారుల రాబడుతున్నారు. ఆంధ్ర-తమిళనాడు సరిహద్దులోని నెల్లిపట్ల అటవీప్రాంతంలో ఎర్రచందనం దుంగలు బయడపడడం ఇదే మొదటిసారి కావడం విశేషం.

రోడ్డు ప్రమాదంలో బాలిక మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బిందుప్రియ

నగరి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మునెప్పనాయుడు కండ్రిగలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బిందుప్రియ(5) అనే బాలిక మృతి చెందింది. పోలీసుల వివరాల మేరకు... మునెప్పనాయుడు కండ్రిగకు చెందిన రాజేష్ కుమార్తె బిందుప్రియ వీధిలో ఆడుకుంటుండగా, వేగంగా వచ్చిన ఆటో ఢీకొనడంతో పాటు పైకి ఎక్కిదిగడంతో బాలిక తీవ్ర రక్తగాయాల పాలైంది. వెంటనే ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో బాలిక మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆటో డ్రైవర్ పరారీలో ఉన్నాడు.

ఉడుమును పట్టుకున్న కేసులో ఇద్దరికి రిమాండ్



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న ఉడుము - చిత్తూరు సబ్‌జైలు వద్ద నిందితులు

చిత్తూరు అర్బన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): వైల్డ్‌లైఫ్ చట్టానికి విరుద్ధంగా ఉడుమును పట్టుకున్న ఇద్దరు నిందితులను ఫారెస్టు అధికారులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ నెల 7వ తేదీన పాలసముద్రం మండలంలో ఉడుమును పట్టారని అటవీశాఖ అధికారులు అదే ప్రాంతానికి చెందిన నితీన్, నవీన్‌లపై కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం ఇద్దరు నిందితుల్ని వైల్డ్‌లైఫ్ చట్టంపై అరెస్టు చేసి, వారి వద్ద నుంచి ఉడుమును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. నిందితుల్ని పట్టుకోవడంలో కృషి చేసిన అటవీశాఖ సిబ్బందిని ఎఫ్ఆర్‌వో థామస్ సుకుమార్ అభినందించారు.

నాపై నారాయణస్వామి కుట్రలే కుట్రలు

● ప్రభుత్వ విప్ థామస్



ఎగువ కమ్మకండ్రిగలో ప్రజల సమస్యలు వింటున్న ప్రభుత్వ విప్ థామస్

వెదురుకుప్పం/శ్రీరంగరాజపురం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): తాను ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన రోజు నుంచి తనపై మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఎన్ని కుట్రలు పన్నినా ఫలించడం లేదని ప్రభుత్వ విప్, గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే థామస్ తెలిపారు. బుధవారం రాత్రి శ్రీరంగరాజపురం మండలం ఎగువ కమ్మకండ్రిగ గ్రామంలో మన ఊరికి.. మన థామస్ కార్యక్రమంలో భాగంగా ఆయన పల్లె నిద్ర చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కమీషన్లకు కక్కుర్తిపడేవాడే నారాయణస్వామి అన్నారు. తాను తిట్టేలా రెచ్చగొడుతున్నాడంటూ ఎందుకు మామా నన్ను గెలుకుతావంటూ వ్యంగోక్తులు విసిరారు. అభివృద్ధి పనులు చేస్తూ, 250 మందికి సీఎం సహాయ నిధి అందించి, పరిశ్రమలు తెస్తున్నందుకా తనపై దుష్ప్రచారం చేస్తున్నావని నారాయణస్వామిపై ధ్వజమెత్తారు. అంబేడ్కర్ దయతో వచ్చిన రిజర్వేషన్లతో మంత్రి పదవులు పొంది ఇప్పుడేమో జగన్ దేవుడని చెప్పే నీచుడు మా మామ నారాయణస్వామి అన్నారు. తన బిడ్డలకు లంచం డబ్బులు సెటిల్మెంట్ చేయలేదని దమ్ముంటే కాణిపాకం వచ్చి ప్రమాణం చేయాలన్నారు.అనంతరం ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు.తహసీల్దార్ లోకనాథపిళ్లై, శ్రీరంగరాజపురం టీడీపీ మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర నాయుడు, సూరిరెడ్డి, జనసేన పార్టీ నియోజకవర్గ ఇంచార్జి డాక్టర్ యుగంధర్ పొన్న, మాజీ సర్పంచ్ కుప్పయ్య, నాయకులు బల్ల వెంకటేష్ నాయుడు, టి.బాబు, నిరంజన్‌రెడ్డి, గంధమనేని రాజశేఖర్ నాయుడు, భాస్కర నాయుడు, రమేష్ నాయుడు, నరసింహులు నాయుడు, వెంకటాచలం, దాము నాయుడు పాల్గొన్నారు.

రైతు పక్షపాతి కూటమి ప్రభుత్వం

ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్





నగరి ఏఎంసీ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న రాజమ్మ - సభ్యుల ప్రమాణ స్వీకారం

నగరి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతుల పాలిట పక్షపాతి కూటమి ప్రభుత్వం అని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. నగరి మార్కెటింగ్ కమిటీ పాలకవర్గం బుధవారం ఉదయం 11 గంటలకు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం పలు పథకాలను ప్రవేశపెట్టిందని తెలిపారు. రైతులకు ఏటా రూ.20 వేలు నగదు చెల్లిస్తుందని, జీఎస్టీ తగ్గింపు వలన వ్యవసాయ పనిముట్లు, ట్రాక్టర్ల ధరలు తగ్గాయని చెప్పారు. ఎరువులు అందుబాటులో ఉంచుతున్నట్లు పేర్కొన్నారు. ధాన్యానికి మద్దతు ధర ప్రకటించి వారం రోజుల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ చేసినట్లు తెలిపారు. మామిడి రైతులను సైతం ఆదుకున్నట్లు చెప్పారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆలస్యంగా ధాన్యం కొనుగోలు చేయడంతో రైతులు అవస్థలు పడ్డారని ఆయన గుర్తు చేశారు. 1982లో టీడీపీ ఆవిర్భావం నుంచి డి.ఎస్.రాజు పార్టీ కోసం కృషి చేశారని, దీనిని గుర్తించి ఆయన సతీమణి రాజమ్మకు చైర్మన్ పదవి ఇచ్చినట్లు తెలిపారు. పాలకమండలి రైతుల సంక్షేమం కోసం కృషి చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా రాజమ్మ, వైస్ చైర్మన్‌గా రామ్మూర్తినాయుడు, డైరెక్టర్లుగా దీప, శకుంతల, గీర్వాణి, నరసింహులు, అశోక్, జగన్నాథం, నాగభూషణం రాజు, హేమావతి, లక్ష్మి, రవిరాజు, సులోచనలు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నగరి మార్కెటింగ్ కమిటీ అభివృద్ధికి అవసరమైన నిధులను మంజూరు చేయాలని చైర్మన్ రాజమ్మ, వైస్ చైర్మన్ రామూర్తి నాయుడులు ఎమ్మెల్యేకి విజ్ఞప్తి చేశారు. తెలుగుదేశం పార్టీలో కష్టించే వారికి పదవులు వస్తాయనేదానికి నిదర్శనం నగరి మార్కెటింగ్ కమిటీ పాలకవర్గమేనని పలువురు వక్తలు పేర్కొన్నారు. అనంతరం చైర్మన్‌గా రాజమ్మ పదవీ బాధ్యతలను చేపట్టారు. తర్వాత రైతులకు వరి ధాన్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో నగరి పట్టణ టీడీపీ అధ్యక్షుడు గుణశేఖర్, మండల అధ్యక్షుడు జవహర్ రెడ్డి, రమేష్ రాజు, పుత్తూరు పట్టణ, మండల అధ్యక్షులు జీవరత్నం నాయుడు, ఆరవ బాలాజీ, తోడాల పేట అధ్యక్షుడు దాము యాదవ్, వెంకటేశ్వరరావు, ధనంజయులు నాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు బాలాజీ, లక్ష్మీప్రసన్న, మీర, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పెరిగిన ఆధార్ సేవల రుసుము

ఐదేళ్లలోపు పిల్లలకు ఉచితం



చిత్తూరు రూరల్ మండలం తుమ్మింద సచివాలయంలో జరుగుతున్న ఆధార్ నమోదు కార్యక్రమం

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆధార్ సేవల రుసుమును యూఐడీఏఐ స్వల్పంగా పెంచింది. ఈ నెల 1 నుంచి 2028 సెప్టెంబరు 30వ తేదీ వరకు పెంచిన ఛార్జీలు అమల్లో ఉంటాయి. జిల్లాలో నిత్యం 8వేల నుంచి 10వేల మంది ఆధార్ సేవలు పొందుతున్నారు. ఐదేళ్లకు పైబడిన వారిలో ఆధార్ నవీకరణ చేయించుకోవాల్సిన వారు 50వేలకు పైబడి ఉన్నారు. వారందరినీ ఆధార్ కేంద్రాల బాటపట్టించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఆధార్ ఛార్జీల మార్పుల్లో ఐదేళ్లలోపు పిల్లలకు నూతన ఆధార్ నమోదుతో పాటు బయోమెట్రిక్ ఉచితంగా చేయనున్నారు. ఏడేళ్ల నుంచి 17ఏళ్లకు పైబడిన వారు వేలిముద్ర నవీకరించుకునేందుకు మొన్నటి వరకు రూ.100 రుసుము ఉండగా ఇప్పుడు రూ.125కి పెంచారు. చిరునామాను మార్చుకోవడానికి చెల్లించాల్సిన రూ.50 రుసుమును రూ.75కు పెంచారు. ఆధార్‌కార్డు కలర్ ప్రింట్ ఏ-4 సైజులో ఇవ్వడానికి గతంలో రూ.20 రుసుముండగా దాన్ని రూ.40కి పెంచారు. కొనసాగుతున్న ఆధార్ శిబిరాల్లో పెరిగిన రుసుమును వసూలు చేస్తున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు రూ.10లక్షలు..

వసతి గృహాల అభివృద్ధికి రూ.20 లక్షల నిధులిస్తాం

● కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలాల్లో అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి రూ.10 లక్షలు, వివిధ వసతి గృహాల అభివృద్ధికి రూ.20 లక్షల నిధులు మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, అందుకు గాను 15వ ఆర్థిక సంఘం, జిల్లా పరిషత్ నిధులను వాడుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ మండల ప్రత్యేక అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాలు, కేజీబీవీ వసతి గృహాల్లో తాగునీరు, మరుగుదొడ్ల సమస్యలపై తనిఖీలుచేసి నివేదికలు సిద్ధం చేయాలన్నారు. వసతి గృహాల తనిఖీల్లో సంక్షేమ వసతి గృహ అధికారులు ఉంటున్నారా లేదా, పిల్లలకు మౌలికవసతులు ఉన్నాయా లేదా, పిల్లల ప్రోగ్రెస్ రిపోర్టులను పరిశీలించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్న తీరు, పౌష్టికాహారాన్ని పరిశీలించి లోపాలుంటే నివేదికలు సిద్ధం చేయాలన్నారు. పూతలపట్టు మండలం పేటమిట్ట అంగన్‌వాడీ కేంద్రానికి ఫ్యాన్లు, తాగునీటి పైపులైన్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బంగారుపాళ్యం మండలం వై.బండపల్లె అంగన్‌వాడీ భవన లీకేజీ మరమ్మతులకు కలెక్టర్ అక్కడికక్కడే నిధులు మంజూరు చేశారు. బైరెడ్డిపల్లె అంగన్‌వాడీ కేంద్రం, చౌడేపల్లె అంగన్‌వాడీ భవన మరమ్మతులకు, జీడీ నెల్లూరు, గుడుపల్లె పీహెచ్‌సీలలో మౌలిక సౌకర్యాల కల్పనకు అక్కడికక్కడే పనులను ఆమోదించారు. త్వరలో జిల్లా స్థాయిలో సమీక్షా సమావేశాన్ని నిర్వహిస్తామన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు 16 మంది ఎంపిక

చిత్తూరు క్రీడలు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): చిత్తూరు మెసానికల్ మైదానంలోని ఇన్‌డోర్ స్టేడియంలో మంగళవారం రాత్రి 69వ స్కూల్‌గేమ్స్ జిల్లాస్థాయి తైక్వాండో పోటీలు నిర్వహించారు. అండర్ - 14 విభాగంలో జరిగిన ఈ పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి అధిక సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు. బాలికల విభాగంలో 7మంది ఎంపిక కాగా, బాలుర విభాగంలో 9మంది ఎంపికయ్యారు. వీరు ఈ నెల 11వ తేదీన బాపట్లలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నరని స్కూల్‌గేమ్స్ సెక్రటరీ బాబు తెలిపారు. అనంతరం ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన గ్రాండ్‌మాస్టర్ బాబూరావును డీఎస్‌డీవో బాలాజీ, పీడీలు సన్మానించారు.

జే శాప్ క్రికెట్ టోర్నీ విజేత చిత్తూరు



ట్రోఫీ అందుకుంటున్న చిత్తూరు జట్టు క్రీడాకారులు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జేశాప్ రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నీ విజేతగా చిత్తూరు జట్టు నిలిచింది. అనంతపురంలోని ఆర్డీటీ స్టేడియంలో నాలుగు రోజులుగా జరుగుతున్న ఈ టోర్నమెంట్ బుధవారం ముగిసింది. ఫైనల్‌కు చేరిన చిత్తూరు, తూర్పు గోదావరి జట్ల మధ్య పోటీని జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ టాస్ వేసి ప్రారంభించారు. ఇందులో తూర్పుగోదావరి జట్టుపై చిత్తూరు జట్టు విజయం సాధించి ట్రోఫీని కైవసం చేసుకుంది. ఎమ్మెల్యేలు అమిలినేని సురేంద్ర బాబు, ఎంఎస్ రాజు, పల్లె సింధూర రెడ్డి, జేసీ అస్మిత్‌రెడ్డి, బండారు శ్రావణిశ్రీ, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తదితరులు విజేత, రన్నరప్ జట్లకు బహుమతులు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యేలు మాట్లాడుతూ జర్నలిస్టులు రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

గర్ల్స్ టాయిలెట్‌లో హిడెన్ కెమెరా కలకలం

చిత్తూరు రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): చిత్తూరుసమీపంలోని ఓ యూనివర్సిటీలో హిడెన్ కెమెరా ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది.ఈ నెల ఒకటవ తేదిన ఇంజనీరింగు చదువుతున్న ఒక విద్యార్థిని టాయిలెట్‌లోకి వెళ్లింది. అక్కడ ఓ సెల్‌ఫోన్‌లోని కెమెరా ఆన్‌చేసి ఉన్న విషయాన్ని గమనించిన ఆమె తన తండ్రికి ఫోన్ చేసి చెప్పింది. మరుసటి రోజు ఆమె తండ్రి వచ్చి కళాశాలలోనే ఇలాంటి సంఘటనలు జరుగుతుంటే యాజమాన్యం ఏం చేస్తోందని ప్రశ్నించారు. యూనివర్సిటీ ప్రాంగణంలో తరగతి గదుల నిర్మాణం జరుగుతోంది. ఈ పనులను పర్యవేక్షించే వ్యక్తే టాయిలెట్‌లో సెల్‌ఫోన్ పెట్టినట్లుగా విద్యార్థుల సాయంతో యాజమాన్యం తెలుసుకుని విచారించింది. ఆ వ్యక్తి వద్ద ఉన్న ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకుని పంపించేసింది.అయితే గతంలో అతడేమైనా రికార్డు చేసి వుంటాడా అని విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు.వర్సిటీలో జరుగుతున్న సంఘటనలపై యాజమాన్య పెద్దలకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మెయిల్ ద్వారా ఫిర్యాదు పంపినట్లు సమాచారం.

ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడివుంది



కుప్పంలో జరిగిన శిబిరంలో రక్తపరీక్ష చేయించుకుంటున్న పీఎస్ఎం తదితరులు

కుప్పం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య పరి రక్షణకు ప్రభుత్వం కట్టుబడివుందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, పీకేఎం ఉడా చైర్మన్ డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు అన్నారు. కుప్పం ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలలో మంగళవారం భవ్య సంస్థ ద్వారా ఉచిత రక్త పరీక్షా శిబిరం నిర్వహించారు. సాంక్రమిత వ్యాధులను ముందుగా గుర్తించి చికిత్సలందించే లక్ష్యంతో వైద్య ఆరోగ్యశాఖ చేపట్టిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ తరచూ రక్తపరీక్షలు చేయించుకుని అనారోగ్యాన్ని గుర్తించి, వైద్యం చేయించుకోవడం ద్వారా ఆయురారోగ్యాలతో ఉండవచ్చన్నారు. అందుకే ప్రభుత్వం ఆరోగ్య పరిరక్షణకు ఉపయోగపడే ఇటువంటి ఉచిత శిబిరాలను తరచూ నిర్వహిస్తోందన్నారు. కుప్పం నియోజకవర్గ పరిధిలో ప్రత్యేకించి టాటా కన్సెల్టెన్సీ ద్వారా తీసుకువచ్చిన ఆరోగ్య చరిత్ర డిజిటలైజేషన్ వ్యవస్థ గురించి గుర్తు చేశారు. ప్రజారోగ్యం బాగుంటేనే నిజమైన అభివృద్ధి సాధ్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు నమ్ముతారన్నారు. అందుకనే ఆరోగ్య పరిరక్షణ పథకాలకు ప్రాముఖ్యమిచ్చి అమలు చేస్తున్నారని చెప్పారు. అనంతరం ఈ శిబిరంలో పేద ప్రజలకు 47 రకాల రక్త పరీక్షలను ఉచితంగా చేశారు. మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, రెస్కో చైర్మన్ వీజీ.ప్రతాప్, కడా రాజకీయ సలహామండలి సభ్యుడు రాజ్‌కుమార్, టీడీపీ కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేశ్, జనసేన నియోకవర్గ ఇన్‌చార్జి నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పద్యపోటీలు

చిత్తూరు సిటీ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు జాతీయ స్థాయి పద్యపోటీలు నిర్వహిస్తున్నట్లు తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంస్థ 13వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పోటీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. వందకుపైగా శతక పద్యాలు చెప్పగల విద్యార్థులు ఈనెల 16వ తేదీలోగా 95534 29770 నెంబరుకు ఫోన్ చేసి తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఆ ప్రకటనలో తెలిపారు.

వర్షంతో విమానంలోనే ప్రయాణికులు



బుధవారం మధ్యాహ్నం ఒంటిగంట. ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం. అదే సమయంలో కోలాపూర్ నుంచి స్టార్ ఎయిర్ విమానం వచ్చింది. వర్షంతో విమానాన్ని టర్మినల్ బిల్డింగ్ సమీపంలో రన్‌వేపై ఆపేశారు. 15 నిమిషాల తర్వాత వర్షం తగ్గడంతో ప్రయాణికులు విమానం నుంచి బయటకు వచ్చారు.

- రేణిగుంట, ఆంధ్రజ్యోతి







ఆ ముగ్గురూ ఆస్పత్రికి

చికిత్స అందిస్తున్న వైద్యులు ● మరో వృద్ధుడి మృతి



'అవును.. వీళ్ల బతికే ఉన్నారు' అంటూ ప్రాణమున్న శవాల్లా పడున్న వారి గురించి 'ఆంధ్రజ్యోతి' మానవీయ కోణంలో స్పందించింది. మొన్న ఆరుగురు.. మంగళవారానికి ఐదుగురయ్యారు. మంగళవారం వృద్ధుడి మృతితో నలుగురు మిగిలారు. ఎవరికీ పట్టని ఆ నలుగురి దైన్యస్థితి, వారికి అమ్మలా సేవలు అందిస్తున్న సామాజిక కార్యకర్త సుజాత గురించి ప్రస్తావించింది. దీనికి కలెక్టర్ వెంకటేశ్వర్ నుంచి మానవీయ కోణంలో స్పందన లభించింది. తిరుపతి రుయాస్పత్రి సమీపంలోని ఇస్కాన్‌కు వెళ్లే రోడ్డు పక్కన బస్టాప్‌లో పడున్న ఆ నలుగురికీ మెరుగైన చికిత్స అందించాలని డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్‌ను బుధవారం కలెక్టర్ ఆదేశించారు. వైద్య సిబ్బంది అక్కడకు చేరుకునే సరికే మరో వృద్ధుడు మరణించాడు. మిగిలిన ముగ్గురిని రుయాస్పత్రికి తరలించి అవసరమైన వైద్యం అందిస్తున్నారు. వైద్య సిబ్బంది కంటే ముందే అక్కడకు చేరుకున్న సామాజిక కార్యకర్త సుజాత మృతి చెందిన మరో వృద్ధుడికి కూడా సొంత ఖర్చులతో దహన సంస్కారాలు నిర్వహించారు. చికిత్స పొందుతున్న ముగ్గురికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు శ్రీజనతా సేవా మిత్ర హెల్పింగ్ హ్యాండ్ అసోసియేషన్ సభ్యులు ముందుకు వచ్చారు. వారికోసం ముగ్గురు అటెండర్లను రుయాస్పత్రిలో ఉంచారు. అవసరమైన మందులను అందిస్తామని తెలిపారు. ఆ ముగ్గురి ఆరోగ్యం మెరుగై.. వారు కోలుకోవాలని అందరూ ఆకాంక్షిస్తున్నారు.

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి

టీడీపీ నేతల చొరవ..కల్వర్టుకు మరమ్మతులు



సోమల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): నంజంపేట-పొదలకుంటపల్లె మార్గంలోని దళవాయి చెరువు వద్ద కల్వర్టుకు బుధవారం మరమ్మతులు చేపట్టారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తాత్కాలిక కల్వర్టు కొట్టుకు పోయింది. ఈక్రమంలో పొదలకుంటపల్లె, ఎం. వడ్డిపల్లె, తుగడంవారిపల్లె, సూరయ్యగారిపల్లె నుంచి నంజంపేట, పెద్దఉప్పరపల్లెకు రాకపోకలు స్తంభించిపోయాయి. నంజంపేట హైస్కూల్‌కు వచ్చే విద్యార్థులు రాలేకపోయారు. అదనంగా 10కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు, బాబురావ్, ప్రసాద్‌లు చొరవ తీసుకున్నారు. మరమ్మతులు చేపట్టి రాకపోకలకు మార్గం సుగమం చేయిస్తున్నారు

సూపర్ జీఎస్టీపై అవగాహన



జీఎస్టీ కరపత్రాలను ప్రదర్శిస్తున్న అధికారులు,విద్యార్థులు

కల్లూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): దిగువపోకలవారిపల్లి పంచాయతీ ఎంజేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ అవినాష్‌కుమార్‌రెడ్డి, మండల జీఎస్టీ నోడల్ అధికారి సాబ్‌జాన్, ఎంఈవోలు శిద్దరామయ్య, పోకల తాతయ్యలు మాట్లాడారు. జీఎస్టీ తగ్గింపుతో సన్న, చిన్నకారు రైతులు, పేద, మధ్య తరగతి ప్రజలు, చిరు వ్యాపారులకు, పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగమన్నారు. జీఎస్టీ కరపత్రాలను ప్రదర్శించారు. పంచాయతీ కార్యదర్శి రమణయ్య, కళాశాల ప్రిన్సిపాల్, విభాగాధిపతులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డుల నిర్వహణపై నిర్లక్ష్యం వీడండి



షెడ్డు పరిశీలిస్తున్న ఎంపీడీవో ప్రసాద్

సోమల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): వర్మీ కంపోస్టు తయారీ, డంపింగ్ యార్డుల నిర్వహణల పట్ల నిర్లక్ష్యం వీడాలని ఎంపీడీవో ప్రసాద్ సూచించారు. బుధవారం పొదలకుంటపల్లె సచివాలయాన్ని, డంపింగ్‌లను ఆయన సందర్శించారు. సచివాలయంలో రికార్డులను తనిఖీ చేసి పలు అంశాలపై సమీక్షించారు. జీఎస్టీ సూపర్ సేవింగ్‌పై పలు సూచనలు చేశారు. ఆయనతోపాటు ఎంపీటీసీ నాగభూషణంరెడ్డి , పంచాయతీ కార్యదర్శి ఫయాజ్ బాషా పాల్గొన్నారు.

ఆహార నియమావళితో ఊబకాయం నియంత్రణ



మాట్లాడుతున్న శిరీష

రొంపిచెర్ల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి):ఆహార నియమావళిని పాటిస్తే ఊబకాయం తగ్గించుకోవచ్చని అంగన్వాడీ సూపర్‌వైజర్ శిరీష అన్నారు. చిచ్చిలివారిపల్లె పంచాయతీ లోకావారిపల్లె అంగన్వాడీ కేంద్రంలో బుధవారం ఎనిమిదవ రాష్ట్రీయ పోషణ మహోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా శిరీష మాట్లాడుతూ మనం తినే ఆహారంలో నూనెలు, చక్కెర తగించుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత గురించి వివరించారు. దీప, జ్యోతిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణి సంరక్షణ సమష్టి బాధ్యత



మొక్కలు నాటుతున్న జయశంకర్ తదితరులు

కుప్పం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): వన్యప్రాణులను సంరక్షించుకోవడం మన బాధ్యతని ప్రాంతీయ అటవీ శాఖాధికారి ఆర్.జయశంకర్ అన్నారు. గరిగచీనేపల్లె జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో అటవీశాఖ ఆధ్వర్యంలో బుధవారం వన్యప్రాణి వారోత్సవాలు నిర్వహించారు. వన్యప్రాణులు, అటవీ సంరక్షణ అంశాలకు సంబంధించి విద్యార్థులకు చిత్ర రచన, వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీఆర్వో సమీర్ బాషా, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, అటవీశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి చెకుముకి పరీక్షల నిర్వహణ



పోస్టర్లు విడుదల చేస్తున్న యుగంధర్‌బాబు,జనవిజ్ఞాన వేదిక నాయకులు

పలమనేరు, అక్టోబరు8 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు చెకుముకి టాలెంట్ పరీక్షలను ఈనెల 18 నుంచి నిర్వహిస్తున్నట్టు జనవిజ్ఞానవేదిక జిల్లా కార్యదర్శి యుగందర్‌బాబు తెలిపారు. బుధవారం పలమనేరులో ఈ పరీక్షలకు సంబంధించిన పోస్టర్లను ఆయన విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలిరోజు పాఠశాల స్థాయి, నవంబరు1న మండలస్థాయి, నవంబరు 23న జిల్లా స్థాయి, డిసెంబరు12,13,14 తేదీల్లో రాష్ట్ర స్థాయిలో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జనవిజ్ఞానవేదిక జిల్లా కోశాధికారి గిరిధరమూర్తి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ బాబు, శ్రీపురం సీతారామయ్య, సన్నిరాజు, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

మొరవ మరమ్మతులతో చెరువుకు జలకళ



నిండు కుండలా ఎస్.గొల్లపల్లె పెద్దచెరువు

రామకుప్పం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఎస్.గొల్లపల్లె పెద్దచెరువు కళకళలాడుతోంది. పదేళ్ల క్రితం చెరువు మొరవకు రెండు చోట్ల గండ్లు పడ్డాయి. అప్పటి నుంచి నీరు చేరినా వృథా అయ్యేది. దీంతో చెరువులో నీటి మట్టం తగ్గిపోయేది. వేసవి వస్తే ఆయకట్టు పరిధిలోని బోర్లలో కూడా భూగర్భజలాలు తగ్గి రైతులు ఇబ్బంది పడేవారు. రెస్కో వైస్‌చైర్మన్ విశ్వనాథ్, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ గంట్లప్పగౌడుతో పాటు మండల నేతలు ఎమ్మెల్సీ కంచర్లశ్రీకాంత్ ద్వారా మొరవకు గండ్ల విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్ళారు. దీంతో ఇరిగేషన్ శాఖ మొరవ మరమ్మతులకు రూ.30లక్షలు విడుదల చేసింది. ఇటీవల మరమ్మతులు పూర్తయ్యాయి. తాజాగా కురిసిన వర్షాలతో చెరువు నిండింది. నీటి వృథాను అరికట్టేందుకు చర్యలు తీసుకున్న సీఎం చంద్రబాబు, ఎమ్మెల్సీ కంచర్లశ్రీకాంత్, ఇతర నియోజక వర్గ, మండల నేతలకు ఆయకట్టుదార్లు కృతజ్ఞతలు తెలిపారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

పోలీస్ స్టేషన్‌లో ఆయుధ పూజలు



రొంపిచెర్ల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): దసరా సందర్భంగా రొంపిచెర్ల పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఎస్‌ఐ సుబ్బారెడ్డి ఆయుధపూజా కార్యక్రమం నిర్వహించారు. పోలీస్టేషన్‌ను పచ్చతోరణాలు, పూలతో అలంకరించారు. తపాకులకు, వాహనాలు, రికార్డులకు పూజలు చేశారు. మిఠాయిలు పంచారు.

రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఇద్దరు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, పీడీ

బైరెడ్డిపల్లె, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు పెద్దచెల్లారగుంట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు మీనా , భరత్‌కుమార్‌లు ఎంపికయ్యారు. పాఠశాల హెచ్‌ఎం రవికుమార్, పీడీ మోహన్‌కుమార్‌లు మంగళవారం ఈ విషయం తెలిపారు. క్యాటిల్‌ఫారం జడ్పీఉన్నత పాఠశాలలో జరిగిన అండర్-19 జిల్లాస్థాయి క్రీడాపోటీల్లో మీనా 1500 మీటర్ల పరుగులో ద్వితీయస్థానం, 5 కి.మీ నడక పోటీల్లో భరత్ ద్వితీయ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. వీరిని హెచ్‌ఎం, పీడీ అభినందించారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు



అల్తాఫ్

పలమనేరు, అక్టోబరు8 (ఆంధ్రజ్యోతి) : పట్టణ డిపో పరిధిలో ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే తమ లక్ష్యమని ఆర్టీసీ డిపో మేనేజర్ అల్తాఫ్ పేర్కొన్నారు. నాలుగు రోజుల క్రితం బాధ్యతలు స్వీకరించిన ఆయన బుధవారం పలమనేరు బస్టాండును సందర్శించారు. విద్యార్థులకు సాయంత్రం, ఉదయం వేళల్లో నడుపుతున్న బస్సుల గురించి వివరాలు తెలుసుకొన్నారు. మహిళా ప్రయాణీకుల ఉచిత రవాణా గురించి ఆరీ తీశారు. కంట్రోలర్ రమణను అడిగి పలు వివరాలు తెలుసుకొన్నారు.

ఆర్టీసీ డిపో మేనేజర్‌గా దినేష్



సీఐ సుబ్బరాయుడును కలిసిన దినేష్

పుంగనూరు రూరల్, అక్టోబరు8(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్‌గా దినేష్ బాధ్యతలు చేపట్టారు. పుంగనూరులో పనిచేస్తున్న సుధాకరయ్య రెండు నెలల క్రితం బదిలీ కావడంతో చిత్తూరు ఆర్టీసీ డిపో మేనేజర్ పావని ఇన్‌చార్జిగా వ్యవహరించారు. కుప్పంలో పని చేస్తున్న దినేష్‌ను తాజాగా పుంగనూరుకు బదిలీ చేసినట్లు ఆయన తెలిపారు. ఆయన బుధవారం సీఐ సుబ్బరాయుడిని కలిశారు.

ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీ



స్వీట్ దుకాణంలో పరిశీస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ గుణలక్ష్మి

పుంగనూరు, అక్టోబరు8(ఆంధ్రజ్యోతి): కాలం చెల్లిన ముడి సరుకుతో ఆహార పదార్థాలను తయారు చేసి విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని చిత్తూరు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ గణలక్ష్మీ హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని పలు స్వీట్ దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆహారపదార్థాలను ఎక్కువ కాలం నిల్వ చేసి విక్రయించడం, శుభ్రత పాటించడంలేదని తమకు ఫిర్యాదు అందినట్లు తెలిపారు. హోటళ్లలో కూడా ఇదే తరహాలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిసిందన్నారు. దాడుల్లో పట్టుబడితే లైసెన్స్ రద్దు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

టీడీపీ కార్యకర్తలకు నివాళులు



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ శ్రీకాంత్

రామకుప్పం/శాంతిపురం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): శాంతిపురం మండలం కెనమాకులపల్లె, రాళ్ళబూదుగూరు, బెండనకుప్పంలకు చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్తలు వెంకటేష్, రియాజ్, నారాయణమ్మలు మంగళవారం మృతి చెందారు. ఎమ్మెల్సీ కంచర్లశ్రీకాంత్, పీకెఎం ఉడా చైర్మన్ డా.సురేష్‌బాబు, ఏపీఎస్ఆర్టీసీ వైస్‌చైర్మన్ మునిరత్నంలు ఇతర నేతలు బుధవారం వారి మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు. మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమాల్లో రెస్కో చైర్మన్ ప్రతాప్, టీడీపీ మండల అధ్యక్ష, మాజీ అధ్యక్షులు ఉదయ్‌కుమార్, విశ్వనాథనాయుడు, చలపతి, క్లస్టర్ ఇన్‌చార్జీలు రాజేంద్రప్రసాద్, నాగరాజు పాల్గొన్నారు.

అంబేడ్కర్ పేరుతో వైసీపీ కుట్రలు: టీడీపీ

కల్లూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం వైసీపీ నాయకులు అంబేడ్కర్ పేరును వాడుకోవడం దుర్మార్గమని రాష్ట్ర టీడీపీ ఎస్సీ సెల్ విభాగం ప్రధాన కార్యదర్శి ముల్లంగి వెంకటరమణ విమర్శించారు. పులిచెర్లలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. దేవళంపేటలో అంబేడ్కర్ విగ్రహానికి సంబంధించి వైసీపీ నాయకుల పన్నాగం ఫలించలేదన్నారు. వైసీపీ పాలనలో దళితులపై అనేక దాడులు జరిగాయన్నారు. ఇందుకు డాక్టర్ సుదాకర్ మరణమే నిదర్శనమన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

నెరవేరని కాజ్‌వే కల



నదిలో నడుచుకుంటూ వెళ్తున్న గ్రామస్తులు(ఫైల్‌ఫొటో)

పలమనేరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి) : ఏళ్లు గడుస్తున్నా ముసలిమడుగు గ్రామ సమీపంలో ఏటిగడ్డిండ్లు యానాది కాలనీ వాసుల వెతలు తీరడంలేదు. కనీసం సరయిన దారి కూడా వీరు అవస్థలు పడుతున్నారు. కాలనీ వాసులు మండల కేంద్రానికి రావాలంటే గ్రామం నుంచి సుమారు మూడు కిలోమీటర్లు ప్రయాణించి మొసలిమడుగు చేరుకోవాలి. అక్కడ నుంచి ఆటోల్లో పలమనేరు వస్తుంటారు. వీరి గ్రామానికి మొసలిమడుగుకు మధ్య కౌండిన్య నది ప్రవహిస్తుంటుంది. వర్షాకాలం వస్తే కౌండిన్యనది దాటి రావడం కష్టసాధ్యం. ఒక్కోసారి ప్రాణాంతకం. వారు చాన్నాళ్లుగా తమ గ్రామానికి ఏ నాయకుడు వచ్చినా రాకపోకల కోసం కౌండిన్య నదిపై కాజ్‌వే నిర్మించాలని కోరడం సాధారణమైపోయింది. నాయకులు సరేనంటూ వచ్చేస్తుంటారు. నాయకులు స్పందించకపోవడంతో గ్రామస్థులు చెక్‌డ్యాం ద్వారా నది మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. నదిలో నీరుంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్తుంటారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి కాజ్‌వే నిర్మించాలని కాలనీవాసులు కోరుతున్నారు.



రాకపోకలకు ఈ చెక్‌డ్యామే ఆధారం

జీఎస్టీ తగ్గింపుపై విద్యార్థులకు పోటీలు



ప్రసంగిస్తున్న ఎస్.హరిప్రసాద్

పలమనేరు, అక్టోబరు8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో బుధవారం సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్ కార్యక్రమం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎస్టీ డిప్యూటి కమిషనర్ ఎస్. హరిప్రసాద్ మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు వలన కలిగే ఆర్థిక ప్రయోజనాల గురించి వివరించారు. ఆర్థిక శాఖ అధ్యాపకులు టి.నరసింహులు,జీఎస్టీ ఆఫీసర్ యోగేంద్రనాయుడులు మాట్లాడారు. విద్యార్థులకు వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ప్రథమ బహుమతి రాఘవేంద్ర, ద్వితీయ బహుమతి ప్రసన్న, తృతీయ బహుమతి సౌమ్య గెలుచుకొన్నారు. సమావేశంలో వైస్ ప్రిన్సిపాల్ నందీశ్వరయ్య, అకడమిక్ కోఆర్డినేటర్ సుబ్బయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ

పుంగనూరు రూరల్, అక్టోబరు8(ఆంధ్రజ్యోతి) మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని సీఐ సుబ్బరాయుడు సూచించారు. బుధవారం గూడూరుపల్లె ప్రభుత్వ పాఠశాల ఆవరణలో విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థులు క్రమ శిక్షణతో మెలగాలన్నారు. చెడ్డు మార్గాలకు దూరంగా ఉండటం వల్ల మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని కోరారు. సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహేశ్‌నారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీ విధానంతో ఆదా



మాట్లాడుతున్న శుభారాం కాలేజి ప్రిన్సిపాల్ వెంకటేశులు

చౌడేపల్లె,అక్టోబరు8 (ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ విధానంలో డబ్బులు ఆదా అవుతాయని జూనియర్ కాలేజీ ప్రిన్స్‌పాల్ జయచంద్ర పేర్కొన్నారు. బుధవారం స్థానిక జూనియర్ కళాశాలలో సూపర్ జీఎస్టీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో షబ్బీర్‌అలీ, నోడల్ ఆఫీసర్ కృష్ణమూర్తి, జీఎస్టీవో మోహన్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి జాకిర్‌హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరు రూరల్: జీఎస్టీ తగ్గింపుపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు శుభారాం డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. వెంకటేశులు తెలిపారు. బుధవారం స్థానిక శుభారాం డిగ్రీకాలేజీ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో జీఎస్టీ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ ఉదయ్‌కుమార్ మాటాడారు. విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కాలేజీ అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. బసవరాజ ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ విద్యార్థులకు కూడా ప్రిన్సిపాల్ గల్లా గంగాధర్‌నాయుడు అవగాహన కల్పించారు. కాలేజీ అధ్యాపకులు, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సమాజ స్థాపనే సీఎం లక్ష్యం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న మునస్వామి

రామకుప్పం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంత సమాజ స్థాపనే సీఎం చంద్రబాబు ధ్యేయమని గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర డైరెక్టరు మునస్వామి అన్నారు. బుధవారం బల్ల గ్రామంలో ఉచిత రక్తపరీక్షల శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 40వేల మందికి 48రకాల వ్యాధులకు సంబంధించి రక్తపరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. అవసరమైన చికిత్సలు ఉచితంగా అందేలా చూస్తారన్నారు. విజలాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి పూజిత, నేతలు రామ్మూర్తి, సత్తి, నాగభూషణం, హెల్త్ అసిస్టెంట్ బాలు, ఎంఎల్‌హెచ్‌పీలు పుష్పజ్యోతి, సంధ్య, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

దేవళంపేటలో శాంతియుత ర్యాలీ



వెదురుకుప్పం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): దేవళంపేటలో అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన ఘటనలో పాత్రధారులు, సహకరించిన నాయకులను అరెస్టు చేయాలని బుధవారం రాత్రి కూటమి నాయకులు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. రామాలయం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు నిర్వహించిన ర్యాలీలో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ శత వార్షికోత్సవం



మాట్లాడుతున్న ఆర్‌ఎస్‌ఎస్ నాయకుడు

చౌడేపల్లె, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): స్థానిక రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో ఆర్‌ఎస్‌ఎస్ శత వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పుంగనూరు ఖండ్ సంఘశాలక్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ..1925లో ఆర్‌ఎస్‌ఎస్ ఏర్పడిందన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో సైతం పోరాడిందన్నారు. ప్రతి ఒక్కరు దేశం, ధర్మం కోసం ఆర్‌ఎస్‌ఎస్‌లో చేరాలన్నారు. ప్రజలకు నిస్వార్థంతో సేవలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఖండ్ కార్యవాహక్ జనార్ధన్, ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జేఎంజే విద్యార్థుల క్రీడా ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల పీఈటీలు

పెద్దపంజాణి, అక్టోబరు08(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన మండల స్థాయి ఆటల్లో గుట్టూరు జేఎంజే విద్యార్థులు ప్రతిభ కనబరిచారని హెచ్‌ఎం జోస్పిన్ తెలిపారు. బుధవారం శంకరరాయలపేట హైస్కూల్‌లో అథ్లెటిక్స్‌లో జాహ్నవి 100 మీటర్ల పరుగుపందెంలో మొదటిస్థానం, 200 మీటర్ల పరుగుపందెంలో రెండవ స్థానం, 400 మీటర్ల పరుగుపందెంలో రెండవ స్థానం, లాంగ్‌జంప్‌లో మొదటిస్థానం, హైజంప్‌లో రెండవ స్థానం, షాప్‌పుట్, డిస్కస్‌త్రోలో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. వినీత్‌కుమార్‌రెడ్డి అండర్ -14 బాలుర విభాగంలో వివిధ విభాగాల్లో పతకాలు సాధించాడన్నారు. వీరిని పీఈటీలు షఫీ, దుర్గాప్రసాద్‌లు అభినందించారు.

వరసిద్ధుడికి యూనియన్ బ్యాంకు స్కానింగ్ యంత్రాల వితరణ



స్కానింగ్ యంత్రాన్ని ప్రారంభిస్తున్న శ్రీనివాసకుమార్

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధుడి ఆలయానికి యూనియన్ బ్యాంకు బుధవారం మూడు స్కానింగ్ యంత్రాలను వితరణ చేసినట్లు ఈవో పెంచలకిషోర్ తెలిపారు. ఆలయ అన్నదాన కేంద్రం, డొనేషన్ కౌంటర్, గోసంరక్షణ ట్రస్టు వద్ద ఈ యంత్రాలను వినియోగించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా ఆలయానికి విరాళాలు పంపే వారు ఈయంత్రాలను వినియోగించుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో ఏఈవో ఎస్వీ కృష్ణారెడ్డి, సీఎఫ్‌వో నాగేశ్వరరావు, యూనియన్ బ్యాంకు జీఎం శ్రీనివాసకుమార్, ఆర్‌ఎం సోమంచి శర్మ, బ్రాంచ్ మేనేజర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ పతక గ్రహీతకు సన్మానం

బంగారుపాళ్యం, అక్టోబర్ 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి నుంచి ఎన్‌ఎస్‌ఎస్ పతకం అందుకున్న డాక్టర్ రెడ్డి జిష్ణును బోడబండ్ల గ్రామస్తులు బుధవారం సత్కరించారు. ఈగ్రామానికి చెందిన ఈయన నెల్లూరు జిల్లాలోని బీడీఎస్ చదివే సమయంలో ఎన్‌ఎస్‌ఎస్‌లో చేసిన సేవలకు గుర్తింపుగా ఈనెల 6న రాష్ట్రపతి ముర్ము నుంచి జాతీయ సేవా పతకం పొందారు. ప్రస్తుతం అపోలో వర్సిటీలో పీజీ చదువుతున్న జిష్ణును సర్పంచు నిర్మాల మొగిలీశ్వర్ ఆధ్వర్యంలో సన్మానించారు.

అధ్వాన రహదారులతో నిత్యం అవస్థలు





గుంతలమయమైన బైరెడ్డిపల్లె - కడపనత్తం రహదారి- అధ్వానంగా తయారైన బైరెడ్డిపల్లె - పాతపేట రహదారి

బైరెడ్డిపల్లె, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు రహదారులు గుంతలమయంగా తయారయ్యాయి. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బైరెడ్డిపల్లె-కడపనత్తం మార్గంలో అడుగడుగునా గుంతలతో అగచాట్లు పడుతున్నారు. బైరెడ్డిపల్లె నుంచి పుంగనూరు వెళ్లే దారిలో కూడా అక్కడక్కడా తారురోడ్డు కోతకు గురైంది. వాహనాలు గుంతల్లో దిగి ప్రమాదాల బారిన పడుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కైగల్ నుంచి రామసముద్రం వెళ్లే రహదారిపనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. రోడ్డు కంకరతేలిపోయింది. ప్రయాణించాలంటే సాహసం చేయాల్సి వస్తోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని గ్రామీణ రహదారులను బాగుచేయించాలని పలువురు కోరుతున్నారు.

ఏఎంసీ చైర్మన్‌కు సత్కారం



రాజమ్మను సన్మానిస్తున్న తెలుగు మహిళలు

విజయపురం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని మహారాజపురానికి చెందిన నగరి ఏఎంసీ చైర్మన్ రాజమ్మ బుధవారం పదవీ ప్రమాణం చేసిన సందర్భంగా తెలుగు మహిళలు ఘనంగా సన్మానించారు. నగరి వ్యవసాయ మార్కెట్ యార్డులో పెద్ద ఎత్తున టీడీపీ కార్యకర్తలు స్వాగతం పలికి పూల మాల, శాలువాతో ఘనంగా సత్కరించారు. డైరెక్టర్లు నర్సింహులుయాదవ్, అశోకన్, గీర్వాణిలను సత్కరించారు. మండలం నుంచి సుమారు 200 మంది కార్యకర్తలు పదవీ స్వీకారోత్సవానికి తరలివెళ్లారు. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ బీసీ అధికార ప్రతినిధి చుక్కా ధనుంజయయాదవ్, చిత్తూరు పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యంరాజు, మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు, సింగిల్‌విండో అధ్యక్షుడు బాబుయాదవ్, తెలుగుమహిళా అధ్యక్షురాలు గుణభూషణమ్మ, మాజీ సర్పంచ్ పార్వతమ్మ, వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షురాలు మురళమ్మ, నాయకులు లోకేష్‌రాజు, దశరథరాజు, కొండూరు ధాము, సుధాకర్‌రాజు, గుణశేఖర్‌రెడ్డి, శివలింగం, బాబునాయుడు, వేణుగోపాల్‌నాయుడు, మురళీ తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ డైరెక్టర్లకు సన్మానం



ఏఎంసీ డైరెక్టర్లను సన్మానిస్తున్న నింద్ర మండల టీడీపీ నాయకులు

నింద్ర, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): నింద్ర మండలానికి చెందిన నగరి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లను టీడీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. బుధవారం ప్రమాణ స్వీకారం అనంతరం డైరెక్టర్‌గా పదవి లభించిన నాగభూషణం రాజు(మేళంబాకం), జగన్(నెట్టేరి), రవిరాజు(ఎంస్‌వీఎం పురం), దీప(పాదిరి), హేమావతి(మిట్టకండ్రిగ)లను మండలంలోని టీడీపీ నాయకులు శాలువ, పూలమాలతో సన్మానించారు. సన్మానించిన వారిలో టీడీపీ మండల అధ్యక్షుడు పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్వరరావు, కొప్పేడు ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, నాయకులు దశరథవాసు, వెంకటేశ్వర్ నాయుడు, రవి నాయుడు, బాబుయాదవ్, విజయకుమార్, సంపూర్ణమ్మ, గాలి రమేష్ నాయుడు, మురళీ నాయుడు, కృష్ణయ్య, బాలకృష్ణంరాజు, జయచంద్ర నాయుడు, తేజేష్, ఓంప్రకాష్, గోపి నాయుడు, జయచంద్రరెడ్డి, మహేష్, వెంకటేష్‌రెడ్డి, జగన్, బలరాంరెడ్డి తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు జీఎస్టీపై అవగాహన

పాలసముద్రం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ పన్నులను తగ్గించడం వలన వస్తువుల ధరలు తగ్గిపోయాయని ఎంపీడీవో సతీష్ తెలిపారు. బుధవారం పాలసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు జీఎస్టీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

IN THE COURT OF THE ADDL. CIVIL JUDGE (SENIOR DIVISION) OF CHITTOOR
O.S.No: 56 /2022

Between:
G.M.Gunasekar Naidu....Plaintiff.
And
A.Govindamma , and others ....Defendants.

Notice to the Defendant No. 4:
A.SASIKALA
D/o Late A.Doraswamy Naidu,
W/o Jagannadha Naidu,
R/o Kaidiganikandriga Village,
Gudipala Mandal,Chittoor District
Madam,

Please take notice that the plaintiff filed above case against you for recovery of amount due by your brother late. A.Kamalesh Babu. The above matter stands posted for your appearance on **05-11-2025** before the said court, hence you are here by directed by the Hon'ble court to appear on the said date at **10.30 A.M** before the said court either person or through an advocate, failing witch the matter will be decided against you.

Sd/- **V.R.RAMAKRISHNA**
Advocate,Chittoor,AP,
Cell : 09440206050.

డిస్లెక్సియాపై అవగాహన

యాదమరి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): డిస్లెక్సియా దినోత్సవం సందర్భంగా కె.గొల్లపల్లె హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం భాస్కర్‌రెడ్డి అభ్యసన వైకల్యాల సమస్యపై అవగాహన పెంచాలని పిలుపునిచ్చారు. చదవడం, రాయడం వంటి నైపుణ్యాలలో ఇబ్బందులు పడే పిల్లలు, పెద్దలలో అవగాహన పెంపొందించడమే ఈ దినోత్సవం లక్ష్యమని ఆయన తెలిపారు. డిస్లెక్సియాతో బాధపడుతున్న పిల్లలను అర్థం చేసుకొని, ప్రోత్సహించాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు గణితోపాధ్యాయులు కనకాచారి సూచించారు. భౌతికశాస్త్ర అధ్యాపకులు దామోదరరెడ్డి పాల్గొన్నారు.

అగరంపల్లె ఆర్చి వద్ద దుర్గంధం



ఆర్చి వద్ద నిలిచిన వర్షపు నీరు

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలోని అగరంపల్లె ఆర్చి వద్ద వర్షం కురిసిందంటే భక్తులు, స్థానికులు దుర్గంధంతో అల్లాడి పోతున్నారు. కాణిపాకం నుంచి అగరంపల్లె వైపు వచ్చే వర్షపు నీరు ఆర్చి వద్ద ఓ చోట నిలిచి పోయి తీవ్రమైన దుర్గంధం వెదజల్లుతోంది. పంచాయతీ కార్యాలయానికి అతి సమీపంలో ఉన్నా అధికారులు ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆర్చి వద్ద మురుగునీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని భక్తులు, స్థానికులు కోరుతున్నారు.

రెడ్డి జిష్ణుకు సన్మానం



బంగారుపాళ్యం, అక్టోబర్ 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి నుంచి ఎన్ఎస్ఎస్ పతకం అందుకున్న డాక్టర్ రెడ్డి జిష్ణును మండలంలోని బోడబండ్ల గ్రామస్తులు బుధవారం సత్కరించారు. ఈగ్రామానికి చెందిన ఈయన నెల్లూరు జిల్లాలో బీడీఎస్ చదివే సమయంలో ఎన్ఎస్ఎస్‌లో చేసిన సేవలకు గుర్తింపుగా ఈనెల 6న రాష్ట్రపతి ముర్ము నుంచి జాతీయ సేవా పతకం పొందారు. ప్రస్తుతం అపోలో వర్సిటీలో పీజీ చదువుతున్న జిష్ణును సర్పంచు నిర్మాల మొగిలీశ్వర్ ఆధ్వర్యంలో గ్రామస్తులు సన్మానించారు. రిటైర్డు సీఐ నరసింహులు, నారాయణమ్మ, చిరంజీవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

సర్వీసు రోడ్డు ఏర్పాటుపై స్పందించిన కలెక్టర్

బంగారుపాళ్యం, అక్టోబర్ 8(ఆంధ్రజ్యోతి): చెన్నై-బెంగళూరు జాతీయ రహదారి తంబుగానిపల్లె నుంచి కేజీ సత్రం వరకు సర్వీసు రోడ్డు ఏర్పాటుకు కలెక్టర్ సుమిత్ కుమార్ స్పందించారు. బుధవారం ఉదయం రాగిమానుపెంట రోడ్డు పునరుద్ధరణ పనుల భూమిపూజ కోసం కలెక్టర్ బంగారుపాళ్యంకు రావడంతో తంబుగానిపల్లె గ్రామస్తులు మోహన్ నాయుడు, రవి, గోపాల్ నాయుడు, లోకేష్ తదితరులు తమ సమస్యను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. సర్వీసు రోడ్డు లేక అనతికాలంలోనే 72 ప్రమాదాలు జరగ్గా, 32 మంది మృత్యువాత పడ్డారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన కలెక్టర్ హైవే అథారిటీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే సర్వీసు రోడ్డు ఏర్పాటుకు చర్యలు చేట్టాలని ఆదేశించారు. గ్రామస్తులు కలెక్టర్, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ఐటీఐ విద్యార్థులు కష్టపడే మనస్తత్వం పెంపొందించుకోవాలి

విజయపురం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఐటీఐ విద్యార్థులు కష్టపడే మనస్తత్వం పెంపొందించుకోవాలని డిక్సన్ టెక్నాలజీ ప్రైవేట్ ఇండియా లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ లక్ష్మీపతి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మాధవరం ప్రభుత్వ ఐటీఐలో ప్రిన్సిపాల్ భైరవుడు అధ్యక్షతన విద్యార్థులకు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి రాణించే వారికి అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. అమరరాజా కంపెనీ మేనేజరు వెంకటరమణ మాట్లాడుతూ విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించాలన్నారు. ప్రగతి పవర్ సొల్యూషన్ అధినేత బాలాజీ కిరణ్ మాట్లాడుతూ విద్యార్థులు ఎక్కువగా చెడు వ్యసనాలకు బానిసై పోతున్నారని, వాటికి దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఉపశిక్షణాధికారులు మునికృష్ణయ్య, లలిత తదితరులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం - రాగిమానుపెంట
రోడ్డు పనులకు భూమిపూజ



రాగిమానుపెంట రోడ్డు పునరుద్ధరణ పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

బంగారుపాళ్యం, అక్టోబర్ 8(ఆంధ్రజ్యోతి): నియోజక వర్గ పరిధిలోని గ్రామాల్లో సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన బంగారుపాళ్యం నుంచి రాగిమానుపెంట వరకు సుమారు 8 కిలోమీటర్ల మేర పునరుద్ధరణ పనులకు కలెక్టర్ సుమిత్ కుమార్‌తో కలిసి ఆయన భూమిపూజా కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బంగారుపాళ్యం నుంచి రాగిమానుపెంటకు వెళ్లే రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారిందని గ్రామస్తులు తన దృష్టికి తీసుకువచ్చారని, ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళినట్లు చెప్పారు. కలెక్టర్ సహకారంతో ఈ రోడ్డుకు మోక్షం లభించిందన్నారు. రూ.2 కోట్లు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులకు సూచించారు. అనంతరం జీఎస్టీ 2.0పై ప్రజలకు కలిగే లాభాలపై జిల్లా అంతటా అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేస్తున్నామని కలెక్టర్ చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఎన్పీ ధరణీప్రసాద్, గౌరవ అధ్యక్షుడు ఎన్పీ జయప్రకాష్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దేవళంపేటలో శాంతియుత ర్యాలీ



వెదురుకుప్పం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం దేవళంపేటలో అంబేడ్కర్ విగ్రహానికి నిప్పుపెట్టిన ఘటనలో పాత్రధారులు, సహకరించిన నాయకులను అరెస్టు చేయాలని బుధవారం రాత్రి దేవళంపేటలో కూటమి నాయకులు తెలుగుదేశంపార్టీ ఆధ్వర్యంలో శాంతియుత కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. దేవళంపేటలో శ్రీరాములవారి ఆలయం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీ నాయకులు కొవ్వొత్తులతో ర్యాలీగా వచ్చారు. ఈ ఘటనలో ఇప్పటికే బొమ్మయ్యపల్లె గ్రామ సర్పంచ్, వైసీపీ నేత చొక్కా గోవిందయ్యను పోలీసులు అరెస్టు చేశారని, ఆయనకు సహకరించిన మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామిని అరెస్టు చేయాలని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి పి.మోహన్‌మురళి విజ్ఞప్తి చేశారు. టీడీపీ మండల అధ్యక్షులు చెంగ్రాయ యాదవ్(కార్వేటినగరం), లోకనాథరెడ్డి(వెదురుకుప్పం), స్వామిదాసు(గంగాధర నెల్లూరు), గంధమనేని జయశంకర్ నాయుడు(ఎస్‌ఆర్‌పురం), టీడీపీ నేతలు సాతల గుణశేఖర్, రావిళ్ల వెంకటాద్రి నాయుడు, వి.నాగరాజురెడ్డి, విజయనరసింహారెడ్డి, రాజశేఖర్‌వర్మ, వెంకటరమణారెడ్డి, చొక్కా మహేష్ ఏఎంసీ వైస్ చైర్మన్ రావిళ్ల దేవరాజులు నాయుడు, పీఏసీఎస్ చైర్మన్ బోడిరెడ్డి సుధాకరరెడ్డి, ఎస్సీ మోర్చా ప్రధానకార్యదర్శి పాముల శేషాద్రికుమార్, చందు, గుర్రం రాణి, శ్రీరాములు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్ బాల్ పోటీల్లో వెదురుకుప్పం విద్యార్థినుల ప్రతిభ



వెదురుకుప్పంలో క్రీడాకారులను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

వెదురుకుప్పం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనపరచి రజత పతకం సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు తెలిపారు. ఆ పాఠశాలలో బుధవారం క్రీడాకారులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 4నుంచి 6వ తేదీ వరకు అనకాపల్లి జిల్లా వెలుగొండ మండలం కృష్ణదేవిపేట హైస్కూల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన చంద్రిక, పూజ, మౌనిక, కిరణ్మయి, అంజలి, ప్రియదర్శిని, తాస్విని, గౌతమిలు ఉత్తమ ప్రతిభ కనపరచి రజత పతకం సాధించారని చెప్పారు. క్రీడాకారులను, వారిని ప్రోత్సహించిన ఫిజికల్ డైరెక్టర్ రమేష్‌ను హెచ్‌ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు అభినందించారు.

11న పీవీకేఎన్‌లో ఉచిత వైద్య శిబిరం

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఈ నెల 11న స్థానిక పీవీకేఎన్ కళాశాల ఆవరణంలో చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌ల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఉదయం నుంచి సాయంత్రం వరకు జరుగుతుందని డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి తెలిపారు. బుధవారం డీఆర్‌డీఏ హాలులో ఉచిత వైద్య శిబిరం నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్ష జరిగింది. శిబిరంలో పలు ప్రముఖ ఆస్పత్రులకు చెందిన డాక్టర్లు ఉచిత వైద్యం చేసి మందులు అందిస్తారన్నారు. ఈ శిబిరంలో రక్తపరీక్షలు, చికిత్స విభాగం, గుండె, ఎముకలు, నరాలు, జనరల్, పసిపిల్లల చికిత్స విభాగం, చెవి, ముక్కు, కంటి, బీపీ, పల్స్‌రేట్ పరీక్షలు జరుగుతాయని వివరించారు. డీఆర్‌డీఏ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మామిడి రైతులకు సబ్సిడీ మంజూరు చేయించండి



సీఎం చంద్రబాబుకు వినతిపత్రం ఇస్తున్న కోదండయాదవ్

చిత్తూరు సిటీ, అక్టోబరు 8 (ఆంధ్ర జ్యోతి): సీఎం సార్ మామిడి రైతులకు ఇస్తామని చెప్పిన సబ్సిడీ మంజూరు చేసి ఆదుకోవాలని టీడీపీ చిత్తూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్ కోరారు. ఈ మేరకు మంగళవారం నారావారిపల్లెకు విచ్చేసిన సీఎం చంద్రబాబును కలసి వినతిత్రం సమర్పించారు. జిల్లాలో తోతాపురి మామిడి పం ట రైతులకు ప్రభుత్వం ప్రకటించిన టన్నుకు రూ.4 వేలు ఇంతవరకు రైతుల ఖాతాల్లో జమకాలేదన్నారు. స్పందించిన సీఎం త్వరలోనే రైతుల ఖాతాల్లో నగదు జమ అవుతుందని హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యే మాటతీరు అభ్యంతరకరం: కృపాలక్ష్మి

వెదురుకుప్పం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామిపై ఎమ్మెల్యే థామస్ మాటతీరు అభ్యంతరకరంగా ఉందని జీడీనెల్లూరు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త కృపాలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు.

చంద్రబాబును మీనాన్న మాట్లాడిన తీరు గుర్తు లేదా: టీడీపీ

వెదురుకుప్పం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): నలభై ఏళ్ల సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును నిండు అసెంబ్లీలో ముండ అంటూ డిప్యూటీ సీఎం హోదాలో మీ నాన్న నారాయణ స్వామి మాట్లాడిన తీరు గుర్తు లేదా అంటూ కృపాలక్ష్మిని టీడీపీ నేత అనిల్ నిలదీశారు. బుధవారం వెదురుకుప్పంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వైసీపీ పాలనలో ప్రజలను తిట్టినందుకు వారికి, చంద్రబాబుకు పాదాభివందనం చేసి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అంబేడ్కర్ విగ్రహ ఘటనలో నీచ రాజకీయం చేయాలని చూసిన నారాయణస్వామి క్షమాపణ చెప్పాలన్నారు. ఎమ్మెల్యే థామస్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధిపరచి, పరిశ్రమలు తీసుకొస్తుంటే నారాయణస్వామి దుష్ప్రచారం చేస్తూ అడ్డుపడుతున్నారని ఆరోపించారు. థామస్‌పై విమర్శలు చేస్తే సహించబోమన్నారు.

ఏపీఎస్పీడీసీఎల్ ఏఈఈగా రియాజ్ అహ్మద్



వెదురుకుప్పం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం ఏపీఎస్పీడీసీఎల్ ఏఈఈగా రియాజ్ అహ్మద్ బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. అంతకు ముందు చిన్నగొట్టిగల్లులో విధులు నిర్వహిస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఉద్యోగులు సన్మానించి, సత్కరించారు.


ఎస్జీఎఫ్ క్రీడల్లో పన్నూరు విద్యార్థుల ప్రతిభ



పన్నూరు విజేతలతో ఉపాధ్యాయులు

విజయపురం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఎస్జీఎఫ్ క్రీడల్లో పన్నూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచారని ప్రధానోపాధ్యాయుడు జానకిరామరెడ్డి తెలిపారు. మండల స్థాయిలో గంగమాంబాపురంలో నిర్వహించిన అండర్ - 17, అండర్ - 14 బాయ్స్ గర్ల్స్ కబడ్డీ, ఖో-ఖో విభాగాల్లో ఓవరాల్ చాంపియన్ షిప్ ట్రోఫీ సాధించారని చెప్పారు. విజేతలను, పీడీ అనితను ప్రధానోపాధ్యాయులు అభినందించారు. పిల్లలకు కోలాటం సామగ్రిని జీవశాస్త్రం ఉపాధ్యాయురాలు వాణిశ్రీ వితరణగా అందించారు. పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



బహుమతులను అందజేస్తున్న ప్రిన్సిపాల్

వెదురుకుప్పం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జీఎస్టీ 2.0పై వ్యాసరచన, వక్తృత్వపోటీలను విద్యార్థులకు నిర్వహించారు. ఫొటో ఎగ్జిబిషన్ పోటీలు సైతం నిర్వహించారు. ఉత్తమ ప్రతిభకనపరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

బీఎల్‌వోలకు శిక్షణ

పెనుమూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): పెనుమూరు తహసీల్దారు కార్యాలయంలో బీఎల్‌వోలకు ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటశివ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై శిక్షణ ఇచ్చారు. 2002లోని ఓటరు జాబితాతో 2025 జాబితాతో వెరిఫికేషన్‌పై ఆయన సూచనలు ఇచ్చారు. బీఎల్‌వోలు ఎన్నికల సంబంధిత పనులను సమయపాలనతో ఖచ్చితంగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దారు శ్రావణ్‌కుమార్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

12న ప్రమాణ స్వీకార కార్యక్రమం

గుడిపాల, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండల టీడీపీ అధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యం నాయుడు, సింగిల్‌విండో అధ్యక్షుడిగా పి.ప్రతాప్ నాయుడు, డైరెక్టర్లుగా హరిప్రసాద్, సెల్వినాథన్‌ల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఈ నెల 12వ తేదీన గుడిపాలలో జరుగుతుంది. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ తన స్వంత మండలంలో పార్టీ కోసం కష్టపడిన వారికి తగిన గుర్తింపునిచ్చి పదవులు కట్టబెట్టారు. దీంతో ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించడానికి భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు.

పూతలపట్టు - పోలవరం రోడ్డు వెడల్పు పనులకు నివేదిక సిద్ధం చేయండి

● కలెక్టర్ సుమిత్‌కుమార్

పూతలపట్టు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): పూతలపట్టుమండలంలోని పోలవరం - పెనుమూరు నడుమ రోడ్డు వెడల్పుకు సంబంధించిన నివేదికను సిద్ధం చేయమంటూ బుధవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. పూతలపట్టు నుంచి పోలవరం మీదుగా గొడుగుచింత వరకు రోడ్డు గుంతలమయంగా ఉంది. దీనికి తోడు పూతలపట్టు సమీపాన భీమానది ఉంది. వర్షం కురిస్తే ఈ నదికి నీరు ప్రవహించడంతో చుట్టుపక్కల ఉన్న సుమారు 20 గ్రామాల ప్రజలు తమ స్వగ్రామాలకు వెళ్లేందుకు ఇబ్బందులకు గురౌతున్నారు. భీమానది వద్ద వంతెన ఏర్పాటు చేయాలని స్థానికులు ఎమ్మెల్యే మురళీమోహన్ దృష్టికి తేవడంతో స్పందించిన ఎమ్మెల్యే ఇక్కడ రోడ్డు సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కలెక్టర్ ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ శాఖ అధికారులతో పూతలపట్టు వద్దకు చేరుకుని గుంతలమయంగా ఉన్న రోడ్లను పరిశీలించారు. అలాగే భీమా నదిని కూడా పరిశీలించి వంతెన ఏర్పాటుకు నివేదికను త్వరగా పూర్తిచేసి తమకు అందించాలని కిందిస్థాయి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మురళీమోహన్‌తో పాటు మండల టీడీపీ అధ్యక్షుడు దొరబాబు చౌదరి, మాజీ కన్వీనర్ ప్రతాపనేని చంద్రమౌళి, టీడీపీ నాయకులు చిరంజీవి, హిమకర్, హరి, గంగారపు హరి, ఎంపీడీవో నాగరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నందకుమార్‌తో పాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న పశువర్ధకశాఖ డీడీ గోవిందయ్య

శ్రీరంగరాజపురం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): పాడిరైతులు పశు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశువర్ధక శాఖ డీడీ గోవిందయ్య అన్నారు. బుధవారం కటికపల్లె గ్రామంలో పాడి పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం, పాడి రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాడి రైతులకు రూ.20వేల విలువ చేసే మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏడీ రూపసుందరి, పశువైద్యాధికారులు హేమకుమార్, సుబ్బారావు, శ్రీవిద్య, యషిత, సర్పంచ్ మార్కొండయ్య, పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.